తప్పిన వాయుగండం!

☛ ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

ఈనాడు-తిరుపతి: జిల్లాకు వరద ముంపు తొలగడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అప్రమత్తమైంది. చెన్నై-తడ మధ్య తీరం దాటుతుందనే ప్రకటన నేపథ్యంలో ఆమేరకు సమాయత్తమైంది. తీరం దాటిన తర్వాత ఊహించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. కొన్ని ప్రాంతాల్లో కాజ్‌వేలపై నీరు పొంగడంతోపాటు గుడిసెలు దెబ్బతినడం మినహా ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. తీర ప్రాంత మండలాల్లోనూ ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు.



శ్వేతాచలం..: శేషాచల కొండలపై శ్వేతవర్ణంలో కనిపించిన మేఘాలు

తిరుపతి నగరంలో బుధవారం రాత్రి నుంచి వర్షం తగ్గుముఖం పట్టింది. దీంతో ముంపు ప్రమాదం తప్పింది. కొరమీనుగుంటలో నిల్చిన నీటిని గురువారం ఉదయం జేసీబీలతో రహదారి పక్కన మట్టి తోడి మళ్లించారు. కరకంబాడి వద్ద ప్రధాన రహదారిపై కొంత మేరకు నీరు నిల్చింది. వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేదు.

అధికారుల సన్నద్ధతతో..

భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ముందుగానే జిల్లా, డివిజన్, మండల స్థాయిలో సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి వారికి బాధ్యతలు అప్పగించింది. కాజ్‌వేలపై నీరు ప్రవహించే సమయంలో వాహన రాకపోకలు లేకుండా ఉండేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు.

ముందస్తు పనులతో మేలు

తిరుపతి నగరంలో చిన్నపాటి వర్షానికే రహదారులన్నీ జలయమయ్యే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తోపాటు కార్పొరేషన్ కమిషనర్ మౌర్యలు కాలువల్లోని పూడికను ముందుగానే తొలగించారు. దీనివల్ల నీటి ప్రవాహానికి ఎక్కడా అడ్డులేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో వర్షం నీరు డ్రైనేజీ/వర్షపు నీటి కాలువల్లో దిగువ ప్రాంతాలకు వెళ్లిపోయాయి.



కొరమీనుగుంట వద్ద వరద నీరు మళ్లిస్తున్న జేసీబీ

● వెంకటగిరి మండలం చిన్నన్నపేట వద్ద కల్వర్టు దెబ్బతింది. దీనికింద ఉన్న పైపులు విరిగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఏర్పేడు మండలం గుడిమల్లం వద్ద ఉన్న కాజ్‌వేపై బుధవారం వరకు నీరు వెళ్లడంతో రాకపోకలు నిలిపివేసి గురువారం పునరుద్ధరించారు. ఇది కొంత మేరకు ప్రమాదకరంగా ఉండటంతో మరమ్మతులు చేయాల్సి ఉంది.

13 నుంచి 17 వరకు పలు మండలాల్లో వర్షపాతం (సెం.మీ.ల్లో)

మండలం	వర్షపాతం
సూళ్లూరుపేట	37.8
తడ	27.8
వాకాడు	27.7
చిట్టమూరు	26.4
ఏర్పేడు	26.1
దొరవారిసత్రం	25.2
వడమాలపేట	24.8
బీఎన్ కండ్రిగ	24.2
పెళ్లకూరు	25
వరదయ్యపాలెం	22.9
తిరుపతి పట్టణం	18.3
తిరుపతి గ్రామీణ	19.5

తాత్కాలికం సరే.. శాశ్వత పరిష్కారమేదీ..?

11 గ్రామాల ప్రజలకు ఇక్కట్లు

నారాయణవనం, న్యూస్‌టుడే: ఏటా వరదలొస్తే తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్న అధికారులు.. శాశ్వత పరిష్కారం చూపడం లేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తిరువట్యం, తుంబూరు, పాలమంగలం ఉత్తరం కాజ్‌వేలు దుస్థితికి చేరుకున్నాయి. వరదలొస్తే ఈ గ్రామీణ ప్రజలు ఊరు చేరడానికి నిత్యం సాహసం చేయాల్సిందే. అరుణానది ఉద్ధృతికి తుంబూరు, పాలమంగలం కాజ్‌వేలు పాక్షికంగా దెబ్బతినగా.. తిరువట్యం కాజ్‌వే రాళ్లు తేలడంతో రాకపోకలు స్తంభించాయి.




నారాయణవనం మండలం తిరువట్యం వద్ద ధ్వంసమైన వంతెన

అన్నదాత కుదేలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: మూడు రోజుల పాటు సూళ్లూరుపేట ప్రాంతంలో కురిసిన వర్షాలకు అన్నదాతలు కుదేలయ్యారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో ఈ సీజన్‌లో సుమారు 8 వేల ఎకరాల్లో వెల్దిపైర్లు సాగు చేశారు. ఇందులో 1,500 ఎకరాల్లో వారం క్రితం పంట వేశారు. ప్రస్తుత వర్షాలకు వేసిన పంట కొట్టుకుపోయింది. మరికొన్ని చోట్ల ఇంకా పంట నీటిలో ఉంది. మరికొందరి పొలాల్లో ఇసుక మేటలు, మట్టి దిబ్బలు వేశాయి. అప్పులు చేసి, పంటలు సాగు చేస్తే.. వర్షాలకు కాస్తా నీటిపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వెల్ది పైర్ల పొలాల్లో ఇసుక మేట



వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన వరినారు

■ ఇరకం దీవిలో పంట మునక

తడ, న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురిసిన వర్షంతో ఇరకం దీవిలో దాదాపు 50 ఎకరాల మేర వరి పంట మునకకు గురైంది. పొలాల్లోని వర్షపునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన తూము మరమ్మతులకు గురైంది. సగం మేర కుంగి మట్టితో పూడుకుపోయింది. ఐదేళ్లుగా తూము మరమ్మతులను వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. దాంతో పొలాల్లోని వర్షపునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోయింది. అధికారులు తూము మరమ్మతులు చేయిస్తే ప్రయోజనం ఉంటుందని కోరుతున్నారు.



ధ్వంసమైన తూము



22.3 అడుగులకు చేరిన అరణియార్

నాగలాపురం, న్యూస్‌టుడే: పిచ్చాటూరులోని అరణియార్ జలాశయ నీటి మట్టం గురువారం సాయంత్రానికి 22.3 అడుగులకు చేరింది. వరద ఉద్ధృతి క్రమేపీ తగ్గుముఖం పట్టి 641 క్యూసెక్కులుగా నమోదవడంతో జలాశయంలో ప్రస్తుతం 0.828 టీఎంసీల నీరు చేరిందని ఏఈ లోకేశ్వరరెడ్డి తెలిపారు.

కళ తప్పిన కళ్యాణి జలాశయం

చంద్రగిరి గ్రామీణ: వర్షాలకు పెద్దగా ప్రవాహం లేకపోవడంతో కళ్యాణి జలాశయం వెలవెలబోతోంది. జలాశయంలో 910 ఎం.సి.ఎఫ్.టి.కి 84.250 మాత్రమే నిల్వ ఉన్నాయి. జలాశయం నిర్వహణలో లోటుపాట్లపై డీఈ పి.వి. ప్రసాద్ స్పందించారు. మూడు గేట్లలో రెండింటికి మరమ్మతులు చేయించారు. కట్టెల మొరవ, కట్టపై ఉన్న ఇసుక, గుళ్లను తొలగించాల్సిందిగా కార్మికులను పురమాయించారు. సౌర దీపాలను బాగు చేయించారు.





తూమును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కల్వర్టు మరమ్మతుకు చర్యలు : కలెక్టర్

వెంకటగిరి: చిన్నన్నపేట-కలవలపూడి మార్గంలో దెబ్బతిన్న కల్వర్టు మరమ్మతుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం దెబ్బతిన్న కల్వర్టును ఆయన పరిశీలించారు. నిధులు మంజూరు చేస్తామని.. మరమ్మతులు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.



విన్నమాల వద్ద నారుమడి పరిస్థితి

వరదయ్యపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని సీఎల్ఎన్‌పల్లి, కళత్తూరు, మరదవాడ, అంబూరులో వరినార్లు నీట మునిగి కుళ్లిపోయాయి. మారేడుకాల్వ నీరు పొలాలకు మళ్లడంతో ఇసుక మేట వేసింది.

జగనన్న కాలనీల్లో..



ఊరందూరు జగనన్న కాలనీలో నిల్చిన నీరు

వైకాపా హయాంలో నిర్మించిన జగనన్న కాలనీల్లో పరిస్థితి దారుణంగా ఉంది. మట్టి రోడ్లు కావడంతో వర్షపు నీరు నిల్చిపోయింది. పక్కన గృహాలు నిర్మాణం చేయని చోట్ల నీరు ఆగింది. వర్షం కారణంగా కేవలం గోడలు నిర్మించిన వాటి పరిస్థితి దారుణంగా ఉంది. సిమెంటు కొట్టుకుపోయి ఇటుకల మధ్య ఇసుక కనిపిస్తోంది. భవిష్యత్తులో ఇది ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నీటిలో నారుమళ్లు.. తప్పని కన్నీళ్లు



దెబ్బతిన్న నారుమడిని చూస్తున్న రైతు ఉదయ్‌కుమార్

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో 15,750 ఎకరాల్లో బీపీటీ రకం నార్లు వారం పది రోజులుగా పోస్తున్నారు. తుమ్మూరు, నరసారెడ్డికండ్రిగ పుదూరు, జువ్వలపాళెం, విన్నమాల, మేనకూరు, తిమ్మాజీకండ్రిగ, అన్నమేడు, మర్లపల్లి పరిధిలో ఈ నారుమడులు ఉన్నాయి. వర్షానికి ఇవి దెబ్బతిన్నాయి. రెండు మూడు రోజులు వర్షం పడకుండా ఉంటేనే బయటపడతాయి. ప్రస్తుతం మళ్లలోని నీటిని రైతులు బయటకు ఎత్తిపోస్తున్నారు.

13 ఎకరాలకు పోశా




బీపీటీ రకం సాగుకు 13 ఎకరాలకు నారుమడి తయారు చేశా. బస్తా రూ. 1325తో కొనుగోలు చేశాం. నాలుగు రోజులుగా వర్షం కురవడంతో నీరు నిలిచింది. కొంత దెబ్బతింది. మరికొంత బయటపడే అవకాశముంది. మళ్లీ కొత్తగా నారు పోయాలి.

\- రవీంద్ర, రైతు, తుమ్మూరు

తీగ లాగేదెవరు..?

డొంక కదిలేదెప్పుడు..?

◆ నిరుద్యోగులకు పలు సంస్థల పేరిట నియామకపత్రాలు
◆ వేతనాలకు ఒత్తిడి చేస్తే చెల్లని చెక్కులు ◆ ఉమ్మడి జిల్లా అంతటా బాధితులు



కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే:

వైకాపా హయాంలో ఉద్యోగ ప్రకటనలు రాకపోవడంతో నిరుద్యోగులు ఉపాధికి ఆరాటపడ్డారు. ఉద్యోగ వేటలో ఉన్న నిరుద్యోగులకు అక్రమార్కులు గాలం వేశారు. పాఠశాలల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రైవేటు కంపెనీల పేరుతో నియామకపత్రాలు సృష్టించారు. వాటిని నిరుద్యోగుల చేతిలో పెట్టి ఒక్కొక్కరి నుంచి రూ.లక్షలు దండుకున్నారు. పాఠశాలల్లో విధులకు వెళ్లిన వీరిని ప్రధానోపాధ్యాయులు అనుమతించారు. వీరిని తీసుకోవాలని ఎలాంటి ఆదేశాలు రాకున్నా అంగీకరించడం.. నెలల తరబడి పనిచేసినా వారికి వేతనాలు ఇవ్వకపోవడం.. ప్రశ్నించిన కొందరికి చెల్లని చెక్కులు చేతిలో పెట్టడం.. బాధితులు ఫిర్యాదు చేస్తే విద్యాశాఖ మొదలు ఏ శాఖ పట్టించుకోకపోవడం.. ఇలా ఈ అక్రమంలో అన్ని శాఖల హస్తం ఉందని వెల్లడవుతున్నా.. అంతకుమించి నాటి అధికార పార్టీ నేతల హస్తం ఉందని తెలుస్తున్నా ఇప్పటివరకు జిల్లా యంత్రాంగం దీనిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఉద్యోగాలు ఒక్కటే.. కంపెనీలే వేరు

కుప్పం మండలం చందం జడ్పీహెచ్ఎస్‌లో రికార్డు అసిస్టెంట్, పాలసముద్రం మండలం ఎస్.ఆర్.ఆర్. కండ్రిగ జడ్పీహెచ్ఎస్‌లో రికార్డు అసిస్టెంట్ నియామకపత్రాలు అందుకున్న ఇద్దరికి వేర్వేరు సంస్థల పేరిట నియామకపత్రాలు ఇచ్చారు. శాంతిపురం మండలం కెనమాకులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఎం.కరుణాకర్ అనే బాధితుడికి ఓ హెల్త్‌కేర్ సంస్థ పేరిట డిజిటల్ అసిస్టెంట్‌గా నియమిస్తున్నట్లు నకిలీ పత్రాన్ని సృష్టించారు. ఒకే ఉద్యోగానికి రెండు కంపెనీల నుంచి నియామకపత్రాలు ఇచ్చారంటే అక్రమాల స్థాయి ఏంటో తెలుస్తోంది.

మోసగించిందిలా..

కుప్పం ప్రాంతంలోని ఓ ఆదర్శ పాఠశాలలో ఒప్పంద ఉద్యోగి ఇందులో కీలకంగా వ్యవహరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అతను కుప్పం పట్టణాలు సహా చిత్తూరు, తిరుపతి నగరాల్లో ఏజెంట్లను నియమించుకుని శాంతిపురం, పలమనేరు, పుంగనూరుతోపాటు అన్నమయ్య జిల్లా మదనపల్లెలోనూ పలువురు నిరుద్యోగులకు ఎర వేసి నగదు వసూలు చేశారు. ఒక్కో ఉద్యోగానికి రూ.2.50 లక్షల నుంచి రూ. 3 లక్షల మేర తీసుకున్నారు. బాధితులు వందల సంఖ్యలో ఉంటారని వాపోతున్నారు.

చెల్లని చెక్కులతో బురిడీ



చందం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడు నెలలపాటు పనిచేసిన కుప్పం మండలం నూలుకుంట గ్రామానికి చెందిన శాంతమూర్తికి వేతనం కింద రూ.80 వేల చెక్కు అందించారు. దాన్ని తీసుకుని బ్యాంకులో నగదు డ్రా చేసేందుకు వెళ్లగా.. సదరు బ్యాంకు ఖాతాలో నగదు లేదనే సమాధానం వినిపించింది. ఇలా చాలామందికి చెక్కులు ఇచ్చారని బాధితులు వాపోతున్నారు.

నగదు అడిగితే బెదిరింపులు



నాకు ఉద్యోగం లేదు. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో నడుమూరు ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించాడు. అప్పుచేసి రూ.2.85 లక్షలు అతనికి ఇచ్చా. ఓ హెల్త్‌కేర్ సంస్థ పేరిట శాంతిపురం మండలం కెనమాకులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగం ఇస్తున్నట్లు నియామకపత్రాన్ని అందించాడు. అక్కడ మూడు నెలలు పనిచేశా. జీతం అందలేదని అడిగితే త్వరలో వస్తుందని చెప్పడంతో ఏడాది పనిచేశా. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సర్వీస్ సర్టిఫికెట్ జారీ చేశారు. తీరా నకిలీ ఉద్యోగమని తెలిసి నగదు ఇవ్వాలని కోరితే అసలు నువ్వు ఇచ్చినట్లు ఆధారాలు ఏమి ఉన్నాయంటూ బెదిరిస్తున్నారు.

\- కరుణాకర్, కోనేరుకుప్పం, శాంతిపురం మండలం

పట్టించుకోని విద్యా, పోలీసు శాఖలు

ఈ దందా వైకాపా హయాంలో 2023, 24లో జరిగింది. న్యాయం కోసం అప్పటి జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్‌కు బాధితులు వినతిపత్రాలు అందించారు. వీటిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోకుండా అక్రమార్కులు అప్పటి వైకాపా ప్రజాప్రతినిధుల పేర్లు వినియోగించినట్లు తెలిసింది. పోలీసులకు ఫిర్యాదులు చేసేందుకు బాధితులు వెళ్లినా.. ఆ ఫిర్యాదులను తిరస్కరించినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేసినా..

పేరు చెప్పేందుకు ఇష్టపడని కుప్పం మండలం వెండుగంపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితను ఇలాగే మోసగించారు. ఉద్యోగం కోసం రూ.2.80 లక్షల నగదు దండుకున్నారు. ఓ సంస్థ పేరుతో నియామక పత్రాన్ని పొందిన ఆమె గోనుగూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేసింది. చివరికి జీతం రాకపోవడంతో ఆమె డీఎస్సీ శిక్షణకు వెళ్లేందుకు ఆ ఉద్యోగాన్ని మానేసినట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా గురువారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 22 కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్నారు. వీరికి దాదాపు 10 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. బుధవారం శ్రీవారిని 75,371 మంది దర్శించుకోగా రూ.4.21 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

నేతల మేతకే నిధులు

☛ ఎఫ్‌డీఆర్ పనులు 'మమ'
☛ పెద్ద వర్షమొస్తే అంతే సంగతులు



కుదిరి సప్లయ్ ఛానల్‌లో పూడిక రోడ్డుపైనే..

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: మిగ్‌జాం తుపాను ప్రభావంతో జిల్లా అతలాకుతలమైంది. చెరువులు, కాలువలకు, పొర్లుకట్టలకు గండ్లు పడ్డాయి. వీటికి తక్షణ మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం ఎఫ్‌డీఆర్ కింద రూ.కోట్లు మంజూరు చేసింది. కొన్ని పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మరికొన్నిచోట్ల చేస్తున్నారు. అయితే ఈ పనుల్లో నాణ్యత నేతిబీర చందంగా మారింది. పలుచోట్ల ఎఫ్‌డీఆర్ పనులు 'మమ' అనిపించారు. జలవనరుల శాఖ పర్యవేక్షణ నామమాత్రం కావడంతో నేతల మేతకే నిధులు పందేరమైనట్లు సమాచారం.

గతేడాది డిసెంబరులో మిగ్‌జాం తుపాను జిల్లాను ఛిన్నాభిన్నం చేసింది. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో 75 వరకు సాగునీటి వనరులు దెబ్బతిన్నాయి. ఇందులో చెరువులు, కాలువలు, కాళంగి పొర్లుకట్టలు ఉన్నాయి. మేజర్‌గా మూడు మండలాల పరిధిలో 16 వరకు ధ్వంసమయ్యాయి. మిగిలిన వాటికి కొంత మేర గండ్లు పడ్డాయి. నెర్రికాలువకు ఏడు చోట్ల, కాళంగి పొర్లుకట్టకు ఐదు ప్రాంతాల్లో గండ్లు ఏర్పడ్డాయి.

అధికారులను మచ్చిక చేసుకొని..

నాయుడుపేట, సూళ్లూరుపేట సబ్ డివిజన్‌లో జలవనరుల శాఖ రూ.7.75 కోట్లతో ప్రతిపాదనలు పంపడంతో సార్వత్రిక ఎన్నికలకు ముందు నిధులు మంజూరయ్యాయి. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో చెరువులు, కాలువలు, పొర్లు కట్టలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. బిల్లులు వస్తాయో లేదోననే భయంతో వైకాపా నేతలు ఈ పనులు చేసేందుకు ఆసక్తి చూపలేదు. కొందరు ధైర్యం చేసి అధికారులను మచ్చిక చేసుకొని కొన్ని పనులు చేశారు. ఇందులో నామినేషన్ కింద రూ.4.90 లక్షల వరకు, అంతకు పైన వాటికి టెండర్లు పిలిచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతలు ఎఫ్‌డీఆర్ పనులపై దృష్టి పెట్టారు. ఈ పనుల్లో నాణ్యత అరకొరగానే ఉంది. పెద్ద వర్షం వస్తే చేసిన పనులు కాస్తా కోతకు గురయ్యే అవకాశం ఉంది. టెండర్లలో పనులు దక్కించుకున్న గుత్తేదారులు వాటిని స్థానిక నేతలకు అప్పగించారు.

కొన్నింటిని పరిశీలిస్తే..

● సూళ్లూరుపేట మండలం కుదిరి సప్లయ్ ఛానల్‌లో రూ.4.90 లక్షలతో పూడికతీశారు. గుత్తేదారు తీసిన పూడికను పక్కనే మన్నేముత్తేరి రోడ్డులో వేశారు. వర్షం కురిస్తే.. పూడికమట్టి మళ్లీ కాలువలోకి చేరే అవకాశం ఉంది. దీంతోపాటు రోడ్డులో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు.



తనయాలిలో చెరువు కట్టకు మట్టి పోసి చదును చేసి..

● దొరవారిసత్రం, తడ, సూళ్లూరుపేట మండలాల్లో పలుచోట్ల చెరువు కట్ట శిఖర భాగంలో పనులు చేశారు. చెరువుకట్టలు మధ్యలో తెగే అవకాశం ఉంటుంది. పశువులు వెళ్లినా కట్టకు వేసిన మట్టి జారిపోతోంది. తనయాలి చెరువు కట్టకు గండి ఉంటే దానిని ఇప్పటి వరకు పూడ్చలేదు.

● సార్వత్రిక ఎన్నికల ముందు తడ మండలంలో పనులు చేసేందుకు ఎవరూ రాకపోవడంతో జల వనరుల శాఖలో కొందరు బినామీ పేర్లతో పనులు చేశారనే ఆరోపణలున్నాయి. అందులోనూ నాణ్యత కొరవడింది.

పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు

సూళ్లూరుపేట ప్రాంతంలో ఎఫ్‌డీఆర్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఉండేలా చేయిస్తాం. కుదిరి సప్లయ్ ఛానల్ పూడికను వేరొకచోటకు తరలిస్తాం. క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - శ్రీధర్, డీఈఈ, జలవనరుల శాఖ

21న మహిళా వర్సిటీలో స్పాట్ ప్రవేశాలు

తిరుపతి (మహిళా వర్సిటీ): శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో ఎంఏ, ఎమ్మెస్సీ కోర్సుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 21న స్పాట్ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు కార్యాలయ సంచాలకులు సువర్ణలతాదేవి తెలిపారు. ఏపీ పీజీసెట్-24లో అర్హత సాధించిన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

టెట్‌కు 2,215 మంది హాజరు

తిరుపతి (బైరాగిపట్టెడ): జిల్లా వ్యాప్తంగా గురువారం మూడు కేంద్రాల్లో జరిగిన టెట్ పరీక్షకు మొత్తం 2,215 మంది హాజరయ్యారు.

అమ్మాయిలు అదరగొట్టారు

అండర్-15 క్రికెట్‌లో రాష్ట్ర జట్టులో స్థానం

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఒకప్పుడు క్రికెట్ కేవలం మగవారు మాత్రమే ఆడేవారు.. కాలానుగుణంగా నేడు మహిళలు కూడా ఈ రంగంలో రాణిస్తున్నారు. తాము ఎందులో తీసిపోమంటూ సత్తా చాటుతున్నారు. క్రికెట్‌ను వేదిక చేసుకుని జీవితానికి స్పష్టమైన లక్ష్యం పెట్టుకున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, శిక్షకుడి సహకారం సద్వినియోగం చేసుకుంటూ సాధన చేశారు. జిల్లా స్థాయి నుంచి జోన్ స్థాయి.. రాష్ట్రస్థాయి వైపు దృష్టి సారించారు బాలికలు. వెంకటగిరిలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన అండర్-15 మహిళా ప్రాబబుల్స్‌లో సత్తా చాటి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించారు.



ఇటీవల మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

జాతీయ జట్టుకు ఎంపిక కావాలని



మాది నెల్లూరు జిల్లా. నరేంద్రబాబు, రమాదేవి తల్లిదండ్రులు. నాన్న ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ క్రికెట్‌లో నేను రాణించేలా కృషి చేస్తున్నారు. వికెట్‌కీపర్, బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నా. ఇప్పటి వరకు 530 పరుగులు చేయగా, ఇందులో ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీలు చేశాను. 10 స్టంపింగ్, 10 క్యాచ్‌లు పట్టుకున్నా. రాష్ట్రస్థాయి జట్టులో రాణించి ఇండియా జట్టుకు ఎంపిక కావడమే నా లక్ష్యం.

– మహాలక్ష్మి, నెల్లూరు

1500 పైగా పరుగులు



మాది తిరుపతి. పదో తరగతి చదువుతున్నా. నాన్న సివిల్ కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డి, తల్లి అనూరాధ. క్రికెట్‌లో రాణించడానికి ప్రధానంగా మా అన్న, అమ్మ కృషి కారణం. ఇప్పటి వరకు దాదాపు 1500 పైగా పరుగులు సాధించా. విజయనగరం, వైజాగ్ జట్లతో తలపడ్డాం. విజయనగరం జట్టుపై అత్యధికంగా 110 పరుగులు సాధించా. కేఎల్ రాహుల్ స్ఫూర్తితో క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నా.

– గ్రీష్మ, తిరుపతి

స్మృతి మంధాన స్ఫూర్తి



తిరుపతి పట్టణానికి చెందిన బ్యాంక్ మేనేజర్ నాగ వెంకటయ్య, దంత వైద్యురాలు, సహాయక ప్రొఫెసర్ శ్రీలక్ష్మి కేదారి మా అమ్మానాన్న. జట్టులో విజయం సాధించడమే లక్ష్యంగా ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నా. ఇప్పటి వరకు 20 పైగా మ్యాచ్‌లు ఆడి 650 పైగా పరుగులు సాధించా. బౌలర్‌గా 25కు పైగా వికెట్లు తీశా. క్రికెటర్ స్మృతి మంధాన స్ఫూర్తితో జాతీయ జట్టులో ఆడటమే లక్ష్యం.

– నేహ శివాని, తిరుపతి

బౌలర్‌గా రాణిస్తా



మాది తిరుపతి. నాన్న మోక్షకానందరెడ్డి ఆర్మీ అధికారి. అమ్మ కల్పన. నేను తొమ్మిదో తరగతి చదువుతున్నా. బౌలర్‌గా రాణిస్తున్నా. ఇప్పటి వరకు 20 మ్యాచ్‌లకు పైగా ఆడి.. 25 పైగా వికెట్లు తీశాను. ఇందులో 4, 3, 5 వికెట్లు చొప్పన ఒక్కో మ్యాచ్‌లో తీశా. బౌలర్‌గా రాణించేందుకు మరిన్ని మెళకువలు నేర్చుకుంటున్నాను. రాష్ట్ర జట్టులో సత్తా చాటుతా. ఇందుకోసం నిరంతరం కృషి చేస్తున్నా.

– గెహనారెడ్డి, తిరుపతి

బార్లలో దిగొచ్చిన ధరలు

● తగ్గింపుపై మద్యం విక్రయాలు ● రిటైల్ దుకాణాల్లో బ్రాండ్లు లభ్యం



లీలామహల్ సమీపంలోని బార్ వద్ద వెలిసిన తగ్గింపు ధరల బ్యానర్

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీతో బార్ల నిర్వాహకులు దిగొచ్చారు. మద్యం ధరలు తగ్గించారు. ఇన్నాళ్లూ ప్రభుత్వ దుకాణాల్లో నాణ్యమైన మద్యం లభ్యం కాకపోవడంతో.. బార్ల నిర్వాహకులు రెండింతల ధరలకు విక్రయించేవారు. మందుబాబులు సైతం నాణ్యమైన మద్యం కోసం అడిగినంత ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకురావడంతో అన్ని మద్యం దుకాణాల్లో నాణ్యమైన బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయి. అందులోనూ ఎమ్మార్పీ ధరలకు విక్రయిస్తున్నట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ విక్రయిస్తుండటంతో మందుబాబులు ఎగబడుతున్నారు. దీంతో కొత్త దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఒక్కసారిగా బార్లకు మందుబాబుల తాకిడి తగ్గడంతో.. భారీ తగ్గింపు ధరలకు మద్యం అంటూ బార్ల వద్ద ఫ్లెక్సీలు పెట్టారు. గతంలో 9 హార్స్ మద్యం క్వార్టర్ సీసా ప్రభుత్వ మద్యం దుకాణంలో రూ.130కి విక్రయిస్తుంటే.. బార్లలో రూ.180కి అమ్మేవారు. ప్రస్తుతం అదే బార్‌లో రూ.140కే విక్రయిస్తున్నారు. ఇక అధిక ధరల మద్యం ఎమ్మార్పీకే ఇస్తున్నారు.



కొత్త దుకాణం వద్ద వరుస కట్టిన మందుబాబులు

184 దుకాణాలు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా రెండోరోజు 184 నూతన మద్యం రిటైల్ దుకాణాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 227 మద్యం దుకాణాలకుగాను.. మరో 43 దుకాణాలు తెరుచుకోవాల్సి ఉంది. రూ.99లకే నాణ్యమైన చీప్ లిక్కర్ అందుబాటులో ఉంచారు. వారంరోజుల్లో ప్రారంభం అవుతాయని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ వాసుదేవ చౌదరి పేర్కొన్నారు.

40 దుకాణాల సరకు డిపోకు

ఖాళీ చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని మద్యం, కంప్యూటర్లు, ఇతర పరికరాలు తిరుపతిలోని మద్యం డిపోకు తరలించారు. గురువారం రాత్రికి 40 దుకాణాలకు సంబంధించిన సరకు చేరింది. తిరుపతి డివిజన్‌లో మిగిలిన 108 దుకాణాలకు సంబంధించిన మద్యాన్ని తరలిస్తున్నారు.

వైభవంగా పౌర్ణమి గరుడసేవ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి ఏడు గంటలకు సర్వాలంకార భూషితుడైన మలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహనసేవలో పెద్దజీయర్, చిన్నజీయర్, తితిదే సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.



గరుడ వాహనంపై కొలువుదీరిన మలయప్పస్వామి

21 నుంచి మూడు జిల్లాల ఉపాధ్యాయులకు శిక్షణ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి కేంద్రంగా ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి రెండు తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరగనుంది. ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పేరుతో జరిగే ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు 300 మందికి పైగా పాల్గొంటున్నట్లు సమాచారం. మొత్తం 4,000 మంది ఉపాధ్యాయులకు విడతల వారీగా ఈ శిక్షణ నిర్వహించనున్నారు. ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ అధికారుల బదిలీల నేపథ్యంలో శిక్షణ తేదీల్లో మార్పులు ఉండవచ్చనే ఊహాగానాలు విద్యా శాఖలో వినిపిస్తున్నాయి. డీఈవోల బదిలీకి సంబంధించి త్వరలో మార్గదర్శకాలు వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

వాల్మీకి జీవితం ఆదర్శనీయం

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి జేసీ శుభం బన్సల్‌తో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. డీఆర్వో పెంచల కిషోర్, జిల్లా బీసీ సంక్షేమశాఖ సాధికారత అధికారి చంద్రశేఖర్, జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, ఏపీసీడబ్ల్యూటీ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ డా.వెంకటేశ్వర్

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: 108 అంబులెన్స్ సర్వీసులో ఉద్యోగ ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజరు సంజీవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పైలట్ ఉద్యోగానికి పదో తరగతి ఉత్తీర్ణులై హెవీ లైసెన్సు లేదా హెవీ ఎల్ఎంవీ ఉండాలి, 35 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎండీ) ఉద్యోగాలకు జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీ ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తిచేసి ఉండాలన్నారు. మెకానిక్ ఉద్యోగాలకు ఏదైనా అనుభవం కలిగి ఉండాలని, నగరంలోని 108 కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. డ్రైవర్ పోస్టులకు ఈనెల 18న వైద్యుల పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రేపు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

చౌడేపల్లె, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 19న ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి వసంత వాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలబాలికల విభాగాల్లో జరిగే ఈ పోటీలకు అర్హులైన క్రీడాకారులను తీసుకొచ్చే పీడీ, పీఈటీలు ఫారం-బీ తీసుకురావాలని సూచించారు. క్రీడాకారుల్లో ఇంటర్ విద్యార్థులుంటే పదో తరగతి మార్కుల జాబితా, ప్రస్తుతం చదువుతున్న కళాశాల స్టడీ సర్టిఫికెట్ జతపరచాలని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన జట్టు ఈ నెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో చిత్తూరు జిల్లా తరఫున తలపడనున్నట్లు వివరించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	129
రిటైల్	151
లేయర్	120
బ్రాయిలర్	219
బ్రాయిలర్ స్కిన్ లెస్	249
లేయర్ మాంసం	204

చెంగాళమ్మ సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయానికి గురువారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీసుధతోపాటు కుటుంబ సభ్యులు విచ్చేశారు. వారు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. వారికి ఈవో ప్రసన్నలక్ష్మి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఆర్డీవో కిరణ్మయి, స్థానిక కోర్టు న్యాయమూర్తి అనూష పాల్గొన్నారు.



పూజల్లో జస్టిస్ శ్రీసుధతోపాటు కుటుంబ సభ్యులు

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని పలువురు ప్రముఖులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, సినీనటి రాశి కుటుంబాలు దర్శించుకున్నాయి. ప్రముఖులకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీవారి ఆలయం ఎదుట మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబం



సినీనటి రాశి కుటుంబం

జేఎన్‌టీయూఏ కబడ్డీ జట్ల ఎంపిక

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: జేఎన్‌టీయూఏ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ పోటీలకు ఐదు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఎంపిక పోటీల్ని నిర్వహించి.. మహిళల విభాగంలో 12 మంది, పురుషుల విభాగంలో 12 మందితో తుది జట్లు ఖరారు చేశారు. ఎంపికైన జట్లు ఈ నెల 30 నుంచి చెన్నైలోని ఎస్ఆర్ఎం వర్సిటీలో జరిగే దక్షిణాది అంతర విశ్వవిద్యాలయాల టోర్నీలో తలపడనున్నాయని కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌బాబు, జేఎన్‌టీయూఏ క్రీడల బోర్డు కార్యదర్శి జీవీ రెడ్డి తెలిపారు. పీడీలు సుబ్రహ్మణ్యం రెడ్డి, మణి పాల్గొన్నారు.



ఎంపికైన మహిళల జట్టు

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని ఎం.ధాత్రి మొగదాయమ్మ.. అంతర్జాతీయ కర్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ భువనేశ్వరిదేవి తెలిపారు. గురువారం విద్యార్థినిని అభినందించారు. ఈనెల 2 నుంచి 5 వరకు పుదుచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థిని పాల్గొని ప్రతిభ చాటగా ఉత్తరాఖండ్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పీడీ సాయిసుమతి పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ భువనేశ్వరిదేవి

స్విమ్స్‌లో ఎమ్మెస్సీ స్పాట్ ప్రవేశాలు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్.బిట్ల ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు ఖాళీలకు అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ర్యాంక్ కార్డుతో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు హాజరుకావాలని కోరారు.

రాయితీపై క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్ ఆసుపత్రిలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు రాయితీపై మమోగ్రామ్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు ఎంఎస్ డా.రామ్ పేర్కొన్నారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవాల సందర్భంగా స్విమ్స్ అంకాలజీ, రేడియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల మహిళా వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. 40 ఏళ్లకు పైబడిన మహిళలు పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

తిరుమలకు ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ



మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి, చిత్రంలో సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో పెరిగిపోతున్న వాహనాల రద్దీని నియంత్రించేందుకు అత్యవసరంగా ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి పేర్కొన్నారు. స్థానిక అన్నమయ్య భవనంలో గురువారం తితిదే సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి తితిదే, విజిలెన్స్, పోలీసులు, ఆర్టీఏ, టౌన్ ప్లానింగ్ అధికారులతో స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికలపై చర్చించారు. కమిటీగా ఏర్పడి వారం రోజులలోపు సమస్యలను గుర్తించి పరిష్కారానికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు తితిదే నుంచి అదనపు సిబ్బంది కేటాయింపు, మల్టీలెవెల్ పార్కింగ్ కేంద్రాల నిర్మాణం, ట్యాక్సీ డ్రైవర్ల కట్టడి.. ట్రాఫిక్, పార్కింగ్ ముందస్తు సమాచారం అందించేలా మొబైల్ యాప్ సిద్ధం చేయడం తదితర అంశాలపై చర్చించారు. తితిదే రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

కథల పోటీలకు ఆహ్వానం

తిరుపతి (మహిళా వర్సిటీ) : శ్రీపద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో స్త్రీవాద రచయిత్రి ఓల్గా తండ్రి పోపూరి వేంకట సుబ్బారావు పేరిట వచ్చేనెల 27న ధర్మనిధి ఉపన్యాస సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు సంచాలకులు యువశ్రీ గురువారం తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల విద్యాసంస్థల నుంచి తెలుగుశాఖల విద్యార్థులను కథల పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 'స్త్రీ సామాజిక భద్రత' అంశంపై వచ్చేనెల 10వ తేదీలోపు కథను పంపించాలని సూచించారు. ఉత్తమ కథా రచయితకు రూ.10వేల నగదు బహుమతి ఉంటుందని, వివరాలకు 98859 40011లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అమెరికా రోడ్డు ప్రమాదంలో మరో యువకుడి మృతి

కేవీబీపురం, న్యూస్‌టుడే: అమెరికాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి జిల్లాకు చెందిన నలుగురిలో ముగ్గురు మృతి చెందగా.. ఒకరు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం విదితమే. తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం ఆదరం గ్రామానికి చెందిన బ్రహ్మానందంరెడ్డి, సుగుణ దంపతులకు కుమార్తె, కుమారుడు. కుమారుడు చెన్ను సాయితేజ అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. సాయితేజకు సోమవారం సెలవు ఉండటంతో అక్కడే పరిచయమున్న తెలుగు స్నేహితులతో కలిసి అమెరికాలోని ఓ రిసార్ట్‌కు భార్యతో కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జరిగిన కారు ప్రమాదంలో స్నేహితులతో పాటు భార్య హరిత మృతి చెందగా, సాయితేజ తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయితేజ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు: ఒకరి దుర్మరణం

తడ, న్యూస్‌టుడే: తడకండ్రిగ పంచాయతీ బోడిలింగాలపాడు జాతీయ రహదారి కూడలి వద్ద గురువారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తడకు చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు ఢిల్లీబాబు(56) మృతి చెందగా, భవన్‌లాల్ తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీబాబు, భవన్‌లాల్ తహసీల్దారు కార్యాలయంలో పని నిమిత్తం తడ బజారు నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. బోడిలింగాలపాడు వద్ద కూడలి దాటేందుకు వాహనాన్ని ఆపారు. ఈ క్రమంలో వెనుకనే వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఢిల్లీబాబును స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడ్డ భవన్‌లాల్‌ను మెరుగైన చికిత్స కోసం చెన్నై తరలించారు. తడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



కిరణ్ (పాత చిత్రం)

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన ఓ యువకుడు క్షణికావేశంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన కుప్పంలో గురువారం చోటుచేసుకుంది. పురపాలక పరిధిలోని గుల్లేపల్లె వద్ద బెంగళూరు-చెన్నై ప్రధాన రైల్వే మార్గంలో యువకుడి మృతదేహం గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించగా వివరాలు వెలుగులోకి వచ్చాయి. గుడుపల్లె మండలం కంచిబందార్లపల్లె గ్రామానికి చెందిన ఆనంద్ కుమారుడు కిరణ్(18) తిరుపతిలో సంగీత కళాకారుడిగా శిక్షణ తీసుకుంటూ దసరా పండగ రోజు ఇంటికి వచ్చారు. పండగ తర్వాత కూడా తిరుపతి వెళ్లకపోవడంతో తండ్రి బుధవారం సాయంత్రం మందలించారు. వెంటనే యువకుడు ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తండ్రి స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం రైల్వేపట్టాలపై బలవన్మరణానికి పాల్పడి ఉండటంతో ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేక కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి, రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీకృష్ణ దేవరాయలు వర్ధంతి సందర్భంగా గురువారం తిరుపతిలో రాయల్ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నేతలు మాట్లాడుతూ రాయల జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏటా అధికారికంగా నిర్వహించాలని కోరారు.


నివాళులర్పిస్తున్న రాయల్ పీపుల్స్ ఫ్రంట్ ప్రతినిధులు

తిరుమలలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్.. తిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖులు విశ్రాంతి తీసుకునే శ్రీపద్మావతి విశ్రాంతి భవనం వద్ద ఆక్టోపస్ బృందాలు గురువారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించాయి. సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు 50 మంది సిబ్బంది పాల్గొన్నారు. తితిదే ఓఎస్డీ సతీష్‌నాయక్, వీజీవో సురేంద్ర, ఏవీఎస్‌వో శైలేంద్ర, తిరుపతయ్య, డిప్యూటీ ఎస్పీ జగన్నాయయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

చదరంగం పోటీల్లో ప్రతిభ


క్రీడాకారిణి త్రిపురాంబికకు జ్ఞాపిక, ధ్రువపత్రాన్ని ప్రదానం చేస్తున్న అతిథులు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: ఈనెల 15, 16, 17వ తేదీల్లో గుంటూరులోని ఓ ప్రైవేటు పాఠశాల వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో తిరుపతికి చెందిన త్రిపురాంబిక ప్రతిభ కనబరిచింది. అండర్- 15 రాష్ట్రస్థాయి ఓపెన్, బాలికల చదరంగం ఛాంపియన్‌షిప్‌లో 22 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా 8 రౌండ్లకు 7.5 పాయింట్లు సాధించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. నవంబరు 3 నుంచి 11వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం హోసూరులో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది.

ఇదేం.. చెత్తపని


రెండ్రోజులకు ముందు చెత్తకుప్పను తొలగించిన దృశ్యం

పాకాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ సిబ్బంది పనులు చేయడం లేదంటూ విమర్శించడం ఫ్యాషన్‌గా మారింది. కొందరు మాత్రం కనీస సామాజిక స్పృహ లేకుండా ఇంట్లో చెత్తను రోడ్డుపై పారబోస్తూ చేతులు దులుపుకోవడం పరిపాటిగా ఉంది. పాకాల టౌన్‌లోని సత్యమ్మగుడి నుంచి పోగాతోట, బొంబాయి కుంటకు వెళ్లే మార్గం కూడలి వద్ద నిత్యం చెత్తకుప్పలు చికాకు తెప్పిస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నా అంతలోనే మళ్లీ చెత్తను వేసేస్తున్నారు. ప్రతి రోజూ ట్రాక్టరులో వచ్చి చెత్తను ఇవ్వండని పారిశుద్ధ్య కార్మికులు మొత్తుకుంటున్నా స్థానికులు పట్టించుకోవడం లేదు. ఎప్పుడు ఇంట్లో చెత్తపడినా అప్పుడే రోడ్డుపైకి తెచ్చి వర్షంలోనూ పారబోస్తున్నారు. దీంతో ఇక్కడ దుర్గంధం వదలడం లేదు. సమీపంలో శ్రీసత్యమ్మగుడికి వచ్చే భక్తులు, పక్కనే ఎస్వీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే వందలాది విద్యార్థులు తిరుగుతున్నా పట్టడం లేదు. పంచాయతీ అధికారులు కుండీలు అందుబాటులో ఉంచాలని, అక్కడి ప్రజలు సామాజిక బాధ్యతగా చెత్త బండి, లేదా కుండీలోచే చెత్త వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


గురువారం రోడ్డు పక్కనే ఇలా..

గరుడ వాహనంపై కల్యాణ వేంకన్న



చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీనివాస మంగాపురంలో అర్చావతార రూపంలో కొలువైన శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామివారు గురువారం రాత్రి గరుడవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెరటాసి మాసంలో భాగంగా పౌర్ణమి పురస్కరించుకుని గురువారం నిత్య కట్ల కైంకర్య పూజలు నిర్వహించారు.

వర్షానికి కూలిన వందేళ్ల చింతచెట్టు

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: వర్షాలకు దుర్గసముద్రంలోని వందేళ్ల చింతచెట్టు కూలిపోయింది. గ్రామంలో పాత పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఒంటెల శేఖర్ స్థలంలోని చింతచెట్టు రేకుల షెడ్డుపై అర్ధరాత్రి వేళ ఒరిగిపోయింది. పక్కనే విద్యుత్తు స్తంభంపై కొమ్మలు పడటంతో సరఫరా ఆగిపోయింది. విద్యుత్తు సిబ్బంది స్పందించి సరఫరాను పునరుద్ధరించారు. **యర్రావారిపాలెం, న్యూస్‌టుడే:** మండల వ్యాప్తంగా గురువారం ఎడతెరపిలేని వర్షాలు పడ్డాయి. తలకోన జలపాతానికి మూడ్రోజులుగా పర్యాటకుల సందర్శనను నిషేధించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే మండల ప్రజలు రెవెన్యూ, పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని తహసీల్దారు రూప్‌చంద్, ఎస్సై ఎర్రిస్వామి తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం


వరలక్ష్మి

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీపద్మావతి మహిళా వర్సిటీ గృహవిజ్ఞానశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కె.వరలక్ష్మికి వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్రాంత ఆచార్యులు డి.శారద మార్గదర్శకత్వంలో 'ఇంపాక్ట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇంటర్వెన్షన్ ఆన్ లైఫ్‌స్కిల్స్, న్యూట్రిషనల్ స్టేటస్, లైఫ్‌స్టైల్ అండ్ న్యూట్రిషనల్ బిహేవియర్ ఆఫ్ క్యాన్సర్ సర్వైవర్స్' అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జీవనజ్యోతి తెలిపారు.

చంద్రగిరి డీఈఈగా రెడ్డిసురేష్



పాకాల, చంద్రగిరి, న్యూస్‌టుడే: చిన్ననీటిపారుదల విభాగం చంద్రగిరి సబ్ డివిజనల్ డీఈఈగా సి.రెడ్డిసురేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏఈగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఆయన ఇక్కడ చేరారు. పాకాల, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు మండలాల్లో పనిచేసి ఉండటంతో ఈ ప్రాంతంపై అవగాహన ఉందని, డివిజన్ పరిధిలో నీటిపారుదల వనరుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని ఆయన తెలియజేశారు.

డీఈఈకి పూర్తి అదనపు బాధ్యతలు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: నీటిపారుదలశాఖ తిరుపతి సబ్ డివిజన్-1 డీఈఈగా పనిచేస్తున్న చంద్రశేఖరయ్యకు శ్రీకాళహస్తి డివిజన్-3 డీఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి డివిజన్ డీఈఈ వెంకటేశ్వరప్రసాద్‌కు చిత్తూరు సర్కిల్ డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

వాల్మీకి మహర్షి మానవాళికి ఆదర్శం


వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి సమస్త మానవాళికి ఆదర్శమని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా డీపీవోలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **తిరుపతి(గాంధీరోడ్డు) :** స్విమ్స్ ఆసుపత్రి కూడలిలోని విగ్రహానికి వాల్మీకి సంఘం, భాజపా సంయుక్త ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. భాజపా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్, సీనియర్ నాయకులు జల్లి మధుసూదన్, గోపాల్, నాగరాజు, నాగేశ్వరరావు, వెంకట కిషోర్, నాగేంద్ర పాల్గొన్నారు. **పాకాల :** స్థానిక కార్యాలయంలో ఎంపీడీవో బి.శశిరేఖ, జడ్పీటీసీ సభ్యురాలు నంగా పద్మజారెడ్డి పాల్గొని నివాళి అర్పించారు. **తిరుపతి (జీవకోన) :** వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండగగా ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు టి.గోపాల్ అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం హిందూ, బీసీ ఉద్యోగ సంఘాల నాయకులు నగరంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. **తిరుపతి (నగరపాలిక) :** వాల్మీకి మహర్షి జీవితం నేటితరానికి ఆదర్శనీయమని నగర మేయర్ డా.శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు.

రహదారి మరమ్మతు

స్పందనకు వందనం

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: చల్లావారిపల్లి నుంచి వెంకట్రామాపురానికి వెళ్లే రహదారికి అధికారులు మరమ్మతులు చేపట్టారు. అక్కడక్కడ రోడ్డు కోతకు గురికాగా 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన వచ్చిన వార్తకు అధికారులు స్పందించి బీటీ రోడ్డుకు ప్యాచ్‌వర్క్ పనులు చేశారు. ❖ తిరుపతి - పచ్చికాపల్లం ప్రధాన రహదారిలో బలిజపల్లి వద్ద నీరు నిల్వకుండా అధికారులు చర్యలు చేపట్టారు. వాహన చోదకుల కష్టాలపై ఇటీవల 'బలిజపల్లి దాటాలంటే హడల్' శీర్షికన వచ్చిన వార్తకు సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించారు.

నిరంతరాయంగా విద్యుత్తు అందించాలి

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా పరిధిలో గృహాలు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్తు అందించేందుకు అధికారులు కృషిచేయాలని ఎస్ఈ పి.సురేంద్రనాయుడు అన్నారు. గురువారం తన కార్యాలయం నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో సరఫరాకు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్, డీఈలు, డీఈఈలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే,

సమస్య: రైల్వే కాలనీలోని ఐదో క్రాస్ ఇంటి నంబరు 18-4-150 ప్రాంతంలో మురుగు నీరు ఇళ్లలోకి వస్తోంది.
- నారాయణ, రైల్వే కాలనీ

సమస్య: అబ్బన్న కాలనీ ఎమ్మెస్ ఆసుపత్రి రోడ్ మొత్తం నిన్నటి వర్షానికి నీట మునిగింది.
- దామోదరం నాయుడు, అబ్బన్న కాలనీ

సమాధానం: ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించి రైల్వే కాలనీలోని సమస్యతోపాటు అబ్బన్న కాలనీలో వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.
- యువ అన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక

చంద్రగిరి, న్యూస్‌టుడే:

సమస్య: చంద్రగిరి నుంచి శ్రీనివాసమంగాపురానికి వెళ్లే మార్గం ఇటీవల ఆధునికీకరించారు. ఆర్ఎఫ్ రోడ్డులో చంద్రగిరి నుంచి నరశింగాపురం రైల్వే స్టేషన్ వరకు అక్కడక్కడా సి.సి., బి.టి.రోడ్డు నిర్మించారు. కొత్తపేట బ్రాహ్మణవీధికి వెళ్లే మలుపు వద్ద వర్షంతో కోతకు గురైంది.
- ఎస్కే బాషా, స్థానికుడు

సమాధానం: వర్షాలు తగ్గిన వెంటనే బాగుచేయిస్తాం.
- మాధవన్, ఏఈ, ర.భ, చంద్రగిరి

పేద కుటుంబాలకు బాసట

పాకాల: శ్రీవరసిద్ధి వినాయక సేవాసంఘం దామలచెరువు హైస్కూల్‌గేటుతోపాటు యల్లంపల్లి, ఎన్.హిల్స్‌నగర్, కేశవనగర్, పోలిచెట్టిపల్లి, ఎస్టీకాలనీలకు చెందిన పేద కుటుంబాలకు బాసటగా నిలుస్తోంది. కె.మంగమ్మ(57) కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

తిరుచానూరు: ఓటేరు పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డుల కాలనీలోని వరద బాధితులకు గురువారం తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సర్పంచి లక్ష్మి, వైస్‌ఎంపీపీ మాధవరెడ్డి, లింగేశ్వర్‌నగర్ సర్పంచి కోటేశ్వరరెడ్డి నాయకులు సుబ్రహ్మణ్యం, రాజుయాదవ్, గంగిరెడ్డి, నాగభూషణం, ముదిరాజ్, మునీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ పరిశ్రమపై సమావేశం

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ (ఈసీఎల్) కంపెనీకి సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్ డా.వెంకటేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ శుభం భన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, తెలుగుగంగ ఎస్ఈ మదన్‌గోపాల్, కంపెనీ ప్రతినిధులు సురేష్ ఖండేల్వాల్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈసీఎల్ ప్లాంట్ తూర్పు గేట్ రహదారి వెడల్పు, రోడ్ల అనుసంధానంపై సమావేశంలో చర్చించారు. తెలుగుగంగ ఈఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ట్యాక్సీ స్టాండ్ల పేరుతో దందా

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు ట్యాక్సీ స్టాండ్‌ను ఏర్పాటుచేసి దందాలకు పాల్పడుతున్న ఘటనపై ఓ డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతికి చెందిన మురళీకృష్ణ నాయుడు తిరుమలలోని ముళ్లగుంట పార్కింగ్ స్టాండ్‌లో ట్యాక్సీని ఉంచేందుకు సదరు సంఘం నాయకుడిని కలిశాడు. ఆయన రూ.10,500 డిమాండు చేయడంతో ఎస్పీ సుబ్బరాయుడికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ స్టాండ్‌ను గతంలో వైకాపా నాయకులు ప్రారంభించి స్టిక్కర్ల పంపిణీ చేశారు. బాధితుడిపై రాత్రికి కొందరు దాడికి పాల్పడి బెదిరింపులకు గురిచేయడంతో అతను తనను రక్షించాలని పోలీసులకు వీడియోలో విజ్ఞప్తి చేశారు. ఘటనపై తిరుమల టూటౌన్ పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

చెక్కు బౌన్సు కేసులో ఏడాది జైలు

తిరుపతి(లీగల్) : చెక్కు బౌన్సు కేసులో అటవీ అధికారికి ఏడాది జైలు, రూ.12 లక్షల పరిహారం చెల్లించాల్సిందిగా ఆదేశిస్తూ మూడో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి ఎం.సంధ్యారాణి గురువారం తీర్పు వెలువరించినట్లు ఫిర్యాది తరపు న్యాయవాది భూపతి తెలిపారు. శ్రీకాళహస్తి అటవీ సెక్షన్ అధికారిగా పనిచేసిన బి.టి.కుప్పస్వామి పేరూరు గ్రామానికి చెందిన ఇ.మురుగారెడ్డి వద్ద 2020 జనవరిలో రూ.12లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఏడాది తరువాత రూ.12లక్షలకు చెక్కు జారీ చేయగా అది బౌన్సు కావడంతో మురుగారెడ్డి తిరుపతి కోర్టును ఆశ్రయించారు.

సీఐకి సత్కారం


సీఐ జయచంద్రను సత్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: నూతన సీఐ జయచంద్రను సీపీఎస్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని సీపీఎస్ ఉద్యోగులు గురువారం ఏర్పేడు పోలీసు స్టేషన్‌కు చేరుకుని సీఐకి అభినందనలు తెలిపారు. సీపీఎస్ సంఘంలో కొనసాగుతూ ఉద్యోగులతో పాటు పేద ప్రజలకు ఎనలేని సేవలు చేస్తున్నారని కొనియాడారు. ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్, జిల్లా అధ్యక్షులు దేవానంద్, సుబ్బారెడ్డి, మంజుల, విజయలక్ష్మి, ఇందిరాదేవి పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరుడి హుండీ ఆదాయం రూ.3.61 లక్షలు


హుండీ నగదు లెక్కిస్తున్న సిబ్బంది

నాగలాపురం, న్యూస్‌టుడే: సురుటుపల్లి పల్లికొండేశ్వరుడి ఆలయ హుండీల లెక్కింపును ఈవో ఆధ్వర్యంలో గురువారం ఆలయ ఆవరణలో లెక్కించారు. హుండీల నుంచి రూ.3,61,784లు నగదు, 44 గ్రాముల బంగారం, 904 గ్రాముల వెండి కానుకలు వచ్చినట్లు ఆమె తెలిపారు. డివిజన్ తనిఖీదారులు పరిశీలకులుగా, ప్రధాన రక్షకభటుడు రవి లెక్కింపును పర్యవేక్షించారు.

వర్షపు నీటి సంరక్షణే లక్ష్యం


తొండమనాడు చెరువు కలుజు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జలవనరుల శాఖ ఎస్‌ఈ మదనగోపాల్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: చెరువులకు చేరే వర్షపు నీటిని సంరక్షించడం జలవనరుల శాఖ అధికారులు ప్రధాన లక్ష్యంగా చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. మండలంలోని తొండమనాడు చెరువు కలుజు పారదాన్ని గురువారం ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పెద్ద చెరువైన తొండమనాడు వర్షపు నీటితో కలుజు పారడం ఆనందకరమన్నారు. వర్షానికి ముందు 0.1 టీఎంసీ నిల్వలున్నాయని, భారీ వర్షాల కారణంగా ప్రస్తుతం 0.5 టీఎంసీ మేర నీటి నిల్వలు ఉన్నాయన్నారు. చెరువులకు చేరిన వర్షపు నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖకు దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 350 ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించిందని వారిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వివరించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్‌ఈ మదనగోపాల్, ఈఈ రాధాకృష్ణ, ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రవీ తదితరులు పాల్గొన్నారు. **ఏర్పేడు:** వర్షాలకు నష్టపోయిన పేదలందరిని ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. మండలంలోని కందాడ పంచాయతీ చిన్నపుగుంట ఎస్టీకాలనీని గురువారం పరిశీలించారు. వర్షంతో కూలిపోయిన మూడు పూరిగుడిసెల వద్దకు చేరుకుని బాధితులను పరామర్శించారు.

మద్యం దుకాణం వద్దు.. వరదయ్యపాళెం: మండలంలోని చిన్నపాండూరులో సత్యవేడు-వరదయ్యపాళెం రహదారి పక్కనే గతంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉండగా, అదే దుకాణంలో తాజాగా మద్యం దుకాణం దక్కించుకున్న వ్యాపారులు ఏర్పాటు చేసేందుకు యత్నిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. దుకాణం కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని మరోచోటకు మార్చాలని స్థానికులు ఎక్సైజ్‌శాఖ సీఐకు గురువారం విన్నవించారు.

సమాచారమూ.. సదుపాయమూ

డిజిటల్ చెల్లింపులకు వెసులుబాటు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: చతుర్మాడ వీధుల్లోని మండపాలు ఎంతో విశిష్టతను కలిగినవి. వాహన మండపం అయితే ఆలయం నుంచి ఉత్సవమూర్తులు బయటకు వచ్చినప్పుడల్లా ఇక్కడి మండపంలో ఆశీనులవుతారు. ఇక మిగిలిన మండపాల విషయానికి వస్తే పెళ్లి మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం, బేరివారి మండపంలో నాగవల్లీపొట్టు సమర్పణ జరుగుతుంది. ఇక కృష్ణారెడ్డి మండపంలో బ్రహ్మోత్సవాల్లో తైలసగిరి ప్రదక్షిణోత్సవం సందర్భంగా ఉత్సవర్లను ఇక్కడ నిలిపి ప్రత్యేక హారతులు ఇస్తుండటం సంప్రదాయంగా వస్తోంది.

భక్తులకు అందుబాటులో..

క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులు బస్సు దిగగానే ముక్కంటి ఆలయం తరఫున ఉన్న సమాచార కేంద్రంలో లగేజీలు ఉంచుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మళ్లీ వచ్చి లగేజీలు తీసుకెళ్లే వారు. దూరాల నుంచి మోసాలకు గురి కాకుండా ఆలయ సమాచారాన్ని ఇక్కడి కేంద్రం ద్వారా తెలుసుకునేవారు. అయితే వైకాపా అధికారంలోకి వచ్చాక కరోనా సమయంలో మండపాన్ని మూత వేశారు. ఆపై రూ.20లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేసి ఏడాదిన్నర పాటు కొనసాగించి మళ్లీ తాళాలు వేసి నిరుపయోగంగా మార్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో ఇక్కడి సమాచార కేంద్రాన్ని, ఉచిత లగేజీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఇక డిజిటల్ సేవలు..

ముక్కంటి ఆలయంలోని అన్ని కౌంటర్లలో కేవలం నగదు చెల్లింపులు మాత్రమే అందుబాటులో ఉంటూ వచ్చింది. అయితే నూతన ఈవో చంద్రశేఖర్ ఆజాద్ బాధ్యతలు చేపట్టాక డిజిటల్ చెల్లింపులకు వీలుగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ముక్కంటి ఆలయంలోని రంగుల గోపురం, దక్షిణ గోపురంలో డిజిటల్ చెల్లింపులకు కౌంటర్లు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా సమాచార కేంద్రం ఏర్పాటు చేసిన కృష్ణారెడ్డి మండపంలోనూ భక్తులు డిజిటల్ చెల్లింపుల ద్వారా విరాళాలు, ఆర్జిత సేవలకు నగదు చెల్లించే అవకాశం అందుబాటులోకి తీసుకురావడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ముక్కంటి ఆలయం తరఫున సమాచార కేంద్రం ఏర్పాటు చేసిన కృష్ణారెడ్డి మండపం


సమాచార కేంద్రంలో లగేజీలు భద్రపరుచుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన లాకర్లు

తప్పిన ఇబ్బందులు

తీర్థయాత్రలకు వచ్చే భక్తులు పెద్దసంఖ్యలో తక్కువగా డబ్బులు తమ వెంట ఉంచుకుని వస్తారు. డిజిటల్ చెల్లింపులు లేని కారణంగా విరాళాలు చెల్లించేందుకు ఇబ్బందులు పడేవారు. నూతనంగా ఈ అవకాశం అందుబాటులోకి రావడంతో చెల్లింపులు మరింతగా పెరిగే అవకాశముంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

సత్యవేడు, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీ ఎస్టీ కాలనీలో బోరు నుంచి వచ్చే తాగునీరు రంగు మారి వస్తోంది. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- వెంకటేష్, స్థానికుడు**

సమాధానం: సమస్య మా దృష్టికి వచ్చింది. బోరును పైపులైన్లు మార్చుతాం. **- లోకేశ్, పంచాయతీ కార్యదర్శి**

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని వీకేఆర్‌పై కాలనీ నుంచి చెరివి మీదుగా శ్రీసిటీకి వెళ్లే మార్గంలో రహదారి మధ్యలో గుంత ఏర్పడింది. ద్విచక్రవాహనాల్లో వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. **- అజిత్, నాగనందాపురం**

సమాధానం: మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతానికి తాత్కాలిక మరమ్మతులు చేపడతాం. **- గిరీష్‌బాబు, ఏఈ, ఆర్‌అండ్‌బీ శాఖ**

స్నానఘట్టాలకు మరమ్మతులు చేయండి

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయానికి సమీపంలోని సన్నిధివీధిలో ఉన్న స్నానఘట్టాలను అభివృద్ధి పరచాలంటూ భాజపా నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం స్నానఘట్టాలను పరిశీలించారు. భాజపా పట్టణ కమిటీ అధ్యక్షులు రమేష్‌బాబు, అమర్‌నాథ్, వాసుయాదవ్ పాల్గొన్నారు.

తిరుమలలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్.. తిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖులు విశ్రాంతి తీసుకునే శ్రీపద్మావతి విశ్రాంతి భవనం వద్ద ఆక్టోపస్ బృందాలు గురువారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించాయి. సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు 50 మంది సిబ్బంది పాల్గొన్నారు. తితిదే ఓఎస్డీ సత్రేనాయక్, వీజీవో సురేంద్ర, ఏవీఎస్‌వో శైలేంద్ర ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

మృతుల కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ఉపాధి కోసం అమెరికా వెళ్లిన ప్రవాసాంధ్రులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మృతుల కుటుంబాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. పట్టణంలోని బంగారమ్మ కాలనీలో నివాసముంటున్న భాస్కర్‌రెడ్డి, లత దంపతుల పెద్దకుమార్తె హరితారెడ్డి అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, అదే ప్రమాదంలో ఆమె భర్త సాయితేజ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి భాస్కర్‌రెడ్డి నివాసానికి వెళ్లి మృతుల చిత్రపటానికి నివాళి అర్పించారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామన్నారు. పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పల్లె పండగ


సత్యవేడు: రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చంద్రశేఖర్, శ్రీపతి బాబు


కేవీబీపురం: ఎంఏరాజులకండ్రిగలో..


ఏర్పేడు: అంజిమేడులో..


బీఎన్‌కండ్రిగ: తలారి వెట్టు సీసీ రహదారికి భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీలోని గిరిజన కాలనీలో రూ.6లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. సత్యవేడు నియోజకవర్గ తెదేపా పరిశీలకులు చంద్రశేఖర్, నియోజకవర్గ సమన్వయకర్త డా. శ్రీపతి బాబు పాల్గొన్నారు. **నాగలాపురం:** నాగలాపురం బీసీ కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న మురుగు కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం భూమి పూజ చేశారు. **ఏర్పేడు:** మండలంలోని అంజిమేడు, కోబాక పంచాయతీలో రూ.10లక్షలతో సిమెంట్ రోడ్డు, రూ.7లక్షలతో మురుగు కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్, ఎంపీడీవో సౌభాగ్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. **కేవీబీపురం:** మండలంలోని ఎంఏరాజులకండ్రిగలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. తెదేపా బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపినాధరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రామాంజునాయుడు పాల్గొన్నారు. **బీఎన్‌కండ్రిగ:** మండలంలోని తలారి వెట్టు, కళ్లివెట్టు, వేణుగోపాలపురం, నెలవాయి, వెస్ట్ వరత్తూరు గ్రామాల్లో సీసీ రహదారులు, గోకులం షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు ఎం. సుధాకర్ నాయుడు, ఎంపీడీవో త్రివిక్రమ రావు, తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీపతి బాబు తదితరులు పాల్గొన్నారు.


నాగలాపురం: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

గుంతల రహదారులతో ప్రజలకు అవస్థలు



మండల కేంద్రం నుంచి ఊత్తుకోటకు వెళ్లే మార్గంలోని పార్కు వద్ద రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారిలోని గుంతలు పెద్దవిగా ఏర్పడి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే నరకప్రాయంగా మారింది. మండల కేంద్రం నుంచి వెంకటరాజుల కండ్రిగ వరకు అడుగడుగునా రోడ్డు గుంతలతో దర్శనమివడంతో ద్విచక్ర వాహదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

- న్యూస్‌టుడే, సత్యవేడు

తొట్టెల్లో చెట్లు.. దుస్థితికి సాక్ష్యాలు



చెత్త నుంచి సంపద తయారీతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు అనువుగా ఎనిమిది సంవత్సరాల కిందట గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన బృందావనాలు దుస్థితితో నిరుపయోగంగా మారాయి. మరోమారు తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ బృందావనాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామని ప్రకటించినా కార్యాచరణకు నోచుకోలేదు. పిచ్చాటూరు మండలంలోని రామాపురంలో ఏపుగా చెట్లు పెరిగి గత వైకాపా ప్రభుత్వ హయాంలో దుస్థితికి నిలువెత్తు సాక్ష్యాలను చాటుతున్నాయి. అధికారులు స్పందించి బృందావనాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, నాగలాపురం

బురద దారి.. పడతారు జారి



మండలంలోని పెద్దకన్నలి బీసీ కాలనీకి వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షానికే బురదమయమై చిత్తడిగా మారడంతో గ్రామస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. రైతులు, పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు నిత్యం ఈ రోడ్డు వెంట ప్రయాణించాల్సి ఉంటుంది. నడిచేటప్పుడు బురదలో ఏమాత్రం కాలు జారితే అంతే సంగతులు. గత ఐదేళ్ల కాలంలో పట్టించుకోలేదని కూటమి ప్రభుత్వ పాలకులైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, తొట్టంబేడు

రాయలు వర్ధంతి



శ్రీకృష్ణదేవరాయలకు నివాళి అర్పిస్తున్న బలిజ సంఘం ప్రతినిధులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు బలిజ సంఘం ప్రతినిధులు ఘన నివాళులు అర్పించారు. పట్టణంలోని శ్రీరాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద గురువారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సంఘం ప్రతినిధులు కృష్ణయ్య, కృష్ణమూర్తి, వెంకటేష్‌బాబు, రవి, ఉదయ్‌కుమార్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పాలేశ్వరస్వామికి ఊయలసేవ

నారాయణవనం, న్యూస్‌టుడే: మండలంలోని పాలమంగలం ఉత్తరంలో వెలసిన శ్రీకమలవల్లి సమేత పాలేశ్వరస్వామికి పౌర్ణమి సందర్భంగా ఊయలసేవను వేడుకగా నిర్వహించారు. గురువారం ఉదయం మూలవర్లకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. సాయంత్రం సంకీర్తన నడుమ ఊంజల్‌సేవ చేపట్టారు.

దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీమేధా దక్షిణామూర్తికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కరుణాగురుకుల్ నేతృత్వంలో గురువారం సంకల్ప పూజలు నిర్వహించారు. విశేషోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రెండు వరుసల రోడ్డు నిర్మించండి

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని గుడిమల్లంకు రెండు వరుసల రహదారిని ఏర్పాటు చేయాలని శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ గిరినాయుడు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి విన్నవించుకున్నారు. ఎమ్మెల్యేను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరితగతిన సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


వాల్మీకి జయంతి సందర్భంగా నిర్వహించిన పూజల్లో పాల్గొన్న అధికారులు

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయంలోని అచ్యుతరాయ మండపం ఆవరణలో వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కరుణాగురుకుల్ నేతృత్వంలో ధూప, దీప, నివేదనలు సమర్పించారు. ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈవో లోకేశ్‌రెడ్డి, సతీష్‌మల్లి, సూపరింటెండెంట్లు, అర్చకులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లిలా..?

- నివాసాల మధ్య మురుగు నిల్వలు
- పట్టించుకోని పంచాయతీ పాలకులు

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో మురుగు కాలువలు లేకపోవడంతో వీధులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. నివాసాల మధ్యే మురుగు నిల్వ చేరి దుర్గంధం వ్యాపించడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా పాలనలో చిన్నపాటి సమస్యను కూడా పరిష్కరించకపోవడంతో పల్లెలు రోగాలకు నిలయంగా మారుతున్నాయి.

మురుగు కూపంలా రాచగున్నేరి

శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి పంచాయతీలో పరిశ్రమలు కొలువుదీరడంతో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడే నివసిస్తున్నారు. అయితే అధికారులు మాత్రం పంచాయతీ అభివృద్ధికి శ్రీకారం చుట్టకపోవడంతో ఎటు చూసిన మురుగు నిల్వలే ఉన్నాయి. రాచగున్నేరితో పాటు ఛటర్జీనగర్‌లో నివాసాలు, వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తుండటంతో పందులకు ఆవాసంగా మారింది. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దుర్వాసన భరించలేక స్థానికులే నెలకో పర్యాయం సొంత నిధులతో పంచాయతీని శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

చినుకు పడితే అవస్థలు

ఏర్పేడు మండలంలోని అముడూరు పంచాయతీలో మురుగు కాలువలు ఆక్రమణలకు గురికావడంతో నివాసాల్లోని నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి. వర్షం వచ్చినప్పుడల్లా వీధుల వెంట నెలల తరబడి నీరు నిల్వ చేరుతోంది. దీంతో స్థానికులు ఇంటి నుంచి బయటకు రావాలంటే అవస్థలు పడుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం శూన్యంగా మారింది.


ఏర్పేడు: అమూరులో వీధుల్లో వర్షపునీరు


వీధుల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం

సమస్య పరిష్కారానికి శ్రీకారం

మురుగు సమస్యను పరిష్కరించేందుకు ప్రస్తుతానికి నివాసాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయిస్తాం. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపి త్వరితగతిన మురుగు కాలువలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం.

- పఠాన్ రఫీఖాన్, ఎంపీడీవో, శ్రీకాళహస్తి

అభివృద్ధి పనులకు శ్రీకారం

ఈనాడు కథనానికి స్పందన

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నడుం బిగించారు. 'ఈనాడు' దినపత్రికలో బుధవారం ప్రచురితమైన 'సమస్యల నిలయం తారకరామానగర్' కథనానికి ఆయన స్పందించారు. 'పల్లె పండుగ'లో భాగంగా గురువారం స్థానిక తారకరామానగర్, కరకంబాడిలో రూ.20.75 లక్షలతో నూతన సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. రేణిగుంట పంచాయతీలోని జ్యోతినగర్‌లో రూ.9.70 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

19న మెగా ఉద్యోగమేళా

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: వరదయ్యపాళెం సచివాలయంలో ఈ నెల 19న సృష్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఇన్‌ఛార్జి దొరబాబు గురువారం తెలిపారు. 18-30 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులన్నారు.

గొలుసు దొంగల అరెస్ట్


నిందితులను చూపుతున్న సీఐ వెంకటేశులు, సిబ్బంది

తొట్టంబేడు, న్యూస్‌టుడే: జల్సాలకు అలవాటు పడి మహిళల మెడలోని బంగారు గొలుసుల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సీఐ వెంకటేశులు కథనం మేరకు.. ఈ నెల 15న స్థానిక కుందేటివారి వీధిలో నివాసముంటున్న సుమతి మెడలోని బంగారు గొలుసును లాక్కొని ఇద్దరు యువకులు పరారయ్యారు. బాధిత మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అనుమానాస్పందంగా తిరుగుతున్న తమిళనాడులోని సేలం జిల్లాకు చెందిన శశికుమార్(23), సురేష్(20)లను అదుపులోకి తీసుకుని విచారించగా గొలుసు చోరీకి పాల్పడింది తామేనని అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు సీఐ వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట పాత జడ్పీ సమీపంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. మండలంలోని తిమ్మయ్య గుంతకు చెందిన మునిరత్నం(50) అనారోగ్య కారణంగా పాత చెక్‌పోస్ట్ వద్ద దుకాణంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేణిగుంట పట్టణ పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: బాలిక అదృశ్యమైన ఘటనపై తొట్టంబేడు పోలీసులు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఈశ్వరయ్య తెలిపారు. మండలానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ బాలిక(17) ఈ నెల 8న ఇంటి నుంచి అదృశ్యమైంది. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిలిచిన బస్సు



ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాల్సిన ఆర్టీసీ బస్సులు రోడ్డుపైనే నిలిచిపోతున్నాయి. వెంకటగిరి-తిరుపతి వయా రేణిగుంట మీదుగా నడిచే ఆర్టీసీ బస్సు గురువారం రేణిగుంట పాత చెక్‌పోస్టు కూడలి సమీపంలో నిలిచిపోయింది. చేసేదేమీ లేక ప్రయాణికులను మరో బస్సులో పంపారు.

- న్యూస్‌టుడే, రేణిగుంట

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు
మొదటి రకం: కేజీ రూ. 60 నుంచి రూ. 85 వరకు
రెండో రకం: కిలో రూ. 40 నుంచి రూ. 60 వరకు

కోళ్ల ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	140
లేయర్	120
బ్రాయిలర్స్	250
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	276
లేయర్ మాంసం	204

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ.. సూళ్లూరుపేట: డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూళ్లూరుపేట ఏఎస్‌డబ్ల్యూ సుధామణి తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

వాల్మీకి జయంతి వేడుకలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని వీఎస్ ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ శంకరశర్మ మాట్లాడుతూ వాల్మీకి ఆదికవి అని, ఆయన భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా రామాయణాన్ని రచించారన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోట, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీపీ అంజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వేణు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.


రైల్వే వంతెన వద్ద ఆక్రమణలో మురుగు నిలిచే ప్రాంతం

మంత్రి చెబితే చేయాలా?

మురుగు కాలువలపై తొలగని ఆక్రమణలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: మురుగు కాలువలపై ఆక్రమణలు తక్షణమే తొలగించాలని పురపాలిక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించినా.. నాయుడుపేట పట్టణంలో పుర అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. జువ్వలపాళెం సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో మురుగు నీరు నిల్వ ఉండే చాండ్రియ చెరువు స్థలాన్ని రియల్ వ్యాపారులు పూర్తిగా ఆక్రమించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ర.భ శాఖ వెంబడి ఉన్న ప్రధాన మురుగు కాలువను పూర్తిగా పూడ్చేసి అక్రమ కట్టడాలు కట్టారు. పది అడుగుల వెడల్పున్న ఈ కాలువ ఆక్రమణలతో రెండు అడుగులకు కుచించుకుపోయింది. ఇటీవల కాలువలో పేరుకున్న చెత్తను పురపాలిక సిబ్బంది యంత్రాలతో తొలగిస్తున్నప్పటికీ డ్రైయినేజీ అడ్డంగా ఉన్న ఆక్రమణల జోలికి వెళ్లడం లేదు. బజారు వీధులకు ఇరువైపులా మిగతా వీధి ప్రాంతాల్లో కాలువలన్నీ ఆక్రమణలతో నిండి ఉన్నాయి. వీటిని అధికారులు నిష్పక్షపాతంగా తొలగించకపోతే వర్షాకాల పట్టణ వీధులు ముంపునకు గురికావాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని పుర కమిషనర్ జనార్దన్ దృష్టికి తీసుకెళ్లగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.


జువ్వలపాళెం రోడ్డు వద్ద కాలువపై అక్రమ కట్టడాలు

వరదొస్తే పరిస్థితేంటి?

❖ మరమ్మతుకు నోచుకోని మామిడి కాలువ పొర్లుకట్టలు ❖ పరీవాహక రైతుల ఆందోళన

నాయుడుపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి గూడూరు డివిజన్‌లో ప్రధానంగా ఉన్న మామిడి కాలువకు వరదొస్తే పరిస్థితేంటని పరీవాహక ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది దెబ్బతిన్న పొర్లుకట్టలు సరిచేయక పోవడంతో ప్రస్తుతం నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలువ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. బాలాయపల్లి మండలం అడవిలో ప్రారంభమైన ఈ కాలువ పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, కోట మండలాల మీదుగా ప్రవహించి గూడలి వద్ద స్వర్ణముఖిలో కలుస్తుంది. ఎగువ భాగంలో పడిన వర్షపు నీరంతా మామిడి కాలువకు చేరుతుంది.

పటిష్ఠతపై దృష్టిసారించని వైకాపా ప్రభుత్వం

ఈ కాలువకు ఇరువైపులా పొర్లుకట్టలు పటిష్ఠంగా లేకపోవడంతో పాటు మట్టి తవ్వకాల వల్ల అనేక ప్రాంతాల్లో ధ్వంసం చేశారు. దీంతో ఏటా వర్షాలకు ఉద్ధృతంగా ప్రవహించే సమయంలో వరద ఇరు వైపులా ఉన్న పంటలపై పారడంతో ఇసుక మేటలు వేస్తోంది. సాగులో ఉన్న పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వం మామిడి కాలువ పటిష్ఠతపై దృష్టిసారించకపోగా... నాయుడుపేట మండలం మేనకూరు, కాపులూరు, ఓజిలి మండలం కురుగొండ ప్రాంతాల్లో మట్టి తవ్వకాల కారణంగా కొందరు నాయకులు కట్టలను ధ్వంసం చేశారు.


మూర్తిరెడ్డిపాళెం వద్ద మామిడి కాలువకు పడిన గండ్లు

నామమాత్రంగా ఇసుకతో కట్టల నిర్మాణం

2019లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు నాయుడుపేట మండలం మేనకూరు, మూర్తిరెడ్డి పాళెం, అయ్యప్పరెడ్డి పాళెం, ఓజిలి మండలం మనమాల, కురుగొండ ప్రాంతాల్లో 11 చోట్ల దెబ్బతిన్న పొర్లుకట్టలకు రూ.35 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఈ పనులన్నీ అప్పట్లో ఉన్న వైకాపా ముఖ్యనేతలు దక్కించుకుని కాలువలోని ఇసుకతో నామమాత్రంగా కట్టలు నిర్మించారు. గతేడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు మామిడి కాలువకు భారీ వరద రావడంతో ఇసుకతో నిర్మించిన పొర్లు కట్టడాలు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయాయి. కాలువకు ఇరువైపులా పంటపొలాలు ఇసుక మేటలతో నిండడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.


మేనకూరు వద్ద మట్టి తవ్వకాలతో దెబ్బతిన్న పొర్లుకట్ట

గతంలో చేసిన పనులకు బిల్లులివ్వలేదు

గతంలో మామిడి కాలువ పొర్లుకట్టల మరమ్మతు పనులు చేసిన గుత్తేదారులకు ఇంకా బిల్లులు ఇవ్వలేదు. పనులు కూడా గతంలో ఉన్న ఏఈ పర్యవేక్షించారు. ప్రస్తుత వర్షాలకు పొర్లుకట్టలు దెబ్బ తినలేదు. మరమ్మతుల విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. - శ్రీనివాసులు, ఏఈ

మేమున్నాం.. మీకు తోడుగా..
గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:

సమస్య: సూళ్లూరుపేట పురపాలిక పరిధిలోని వాకాటి నారాయణరెడ్డి నగర్‌లో విద్యుత్తు తీగలపై చెట్ల కొమ్మలు వాలి, ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. - విజయ్‌కుమార్, స్థానికుడు

సమాధానం: ఆ ప్రాంత డిస్కం సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించి, చెట్ల కొమ్మలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. -శేఖర్, డిస్కం డీఈఈ

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: గూడూరు రెండో పట్టణం మాళ్యానగర్ ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. -చిన్నయ్య, స్థానికుడు

సమాధానం: వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. - వెంకటేశ్వర్లు, కమిషనర్

వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 14న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు స్పందించారు. రాణిపేటలో వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

తూముల మరమ్మతు చేపట్టాలి

వాకాడు, న్యూస్‌టుడే: తిరుమూరు చెరువులో తూములు దెబ్బతిన్నాయని, మరమ్మతు చేయాలని ఆయకట్టు మాజీ ఛైర్మన్ కేసీ రమణయ్య, ఆయకట్టు రైతులు గురువారం కలెక్టర్‌కు విన్నవించారు.




అల్లుకున్న తీగలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నరసారెడ్డికండ్రిగలో రోడ్డు పక్కన ఓ విద్యుత్తు స్తంభానికి పచ్చటి తీగలు అల్లుకున్నాయి. ఈ స్తంభానికి పగటి పూట దీపం వెలుగుతోంది. అధికారులు స్పందించి.. సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రైవేటు పరం చేసినా ప్రభుత్వ బోర్డే

నాయుడుపేట, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలను ప్రభుత్వం ప్రైవేటు పరం చేసి కొత్త విధానం అమల్లోకి వచ్చినా నాయుడుపేట పట్టణంలో ఇంకా కొందరు ప్రభుత్వ మద్యం దుకాణాల పేరుతోనే బోర్డులు ఉంచారు. ఎక్కువగా పట్టణంలో మద్యం వ్యాపారులు గతంలో ఉన్న దుకాణాల వద్ద కొత్తవి ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ మద్యం బోర్డులు కనిపిస్తుండడం విశేషం.



ప్రమాదకర ప్రయాణం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నా ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఇద్దరు ఎక్కాల్సిన ద్విచక్ర వాహనంపై నలుగురు ఎక్కి ముందు భాగంలో హ్యాండిల్ తిరగకుండా బ్యాగు పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. గురువారం నాయుడుపేట మల్లాం మలుపు జాతీయ రహదారిపై ఓ కుటుంబ యజమాని కుటుంబ సభ్యులు నలుగురిని ఎక్కించుకుని ప్రమాదకరంగా వెళ్లారు.

డ్రమ్ సీడర్‌తో మంచి దిగుబడి

వెంకటగిరి, న్యూస్‌టుడే: రైతులు డ్రమ్ సీడర్ విధానంలో సాగు చేపడితే మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ ఏడీ నాగార్జునసాగర్ అన్నారు. మండలంలోని కుర్జాగుంట, బుసపాళెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెదజల్లే విధానంతో ఖర్చు తగ్గడమే కాకుండా దిగుబడి పెరుగుతుందన్నారు. వచ్చే నెల 10 నుంచి ఈ విధానం చేపట్టాలన్నారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు కిషోర్, విస్తరణాధికారి రామ్మోహన్, సహాయకులు శివకుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అర్కా సిట్రస్‌తో అధిక లాభాలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: నిమ్మ సాగులో రైతులు అర్కా సిట్రస్‌ను వినియోగించడం వల్ల మంచి లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు, తిరుపతి జిల్లాల నేలలో సూక్ష్మధాతు పోషక లోపాలు ఉన్నాయన్నారు. వీటి నివారణకు భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ తయారుచేసిన అర్కా సిట్రస్ స్పెషల్ 5 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి విప్పారిన లేత ఆకులపై పిచికారీ చేయాలన్నారు. సూక్ష్మ దాతు పోషక మిశ్రమం కావాల్సిన వారు కేవీకేలో సంప్రదించాల్సిందిగా కోరారు.


మన్నూరుకు వెళ్లే మట్టి రోడ్డు తీరు ఇదీ..


మన్నూరు మిట్ట దగ్గర నేరేడు వాగుపై వంతెన

వంతెన నిర్మించారు.. రోడ్డు మరిచారు

మన్నూరుకు తీరని వెతలు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: మన్నూరు గ్రామానికి మండల సముదాయాన్ని చేరువ చేసే రోడ్డు నిర్మాణం ఏళ్ల తరబడి కలగానే మిగిలిపోతోంది. ఈ గ్రామం వ్యవసాయ పొలాల గుండా మన్నూరు మిట్టను కలుపుతూ మండల కేంద్రానికి చేరుకోవాలంటే కేవలం మూడు కి.మీ దూరమే. అయితే గతంలో పొలాల్లో రహదారికి భూ కేటాయింపుల్లేక రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. మన్నూరు న్యూ కాలనీ నుంచి అలిమిలి చుట్టూ తిరిగి 15 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి. ఈ సమస్యపై అనేకసార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. దశల వారీగా ఈ అంశంలో కదలిక వచ్చింది.

ద్విచక్ర వాహనాలు తిరగాలన్నా కష్టమే..

గతంలో తెదేపా ప్రభుత్వంలో మండల సముదాయం దగ్గర్లో వెంకటగిరి- గూడూరు రహదారిలో నుంచి మన్నూరు మిట్ట మీదుగా నేరేడు వాగు వరకు తారు రోడ్డు నిర్మించారు. వాగు దాటాక కొంత వ్యవసాయ పొలాల్లో, కొంత దూరం చెరువు కట్టపైనా మట్టి రోడ్డును ఏర్పాటు చేసి వదిలేశారు. ఇటీవల కాలంలో వాగుపై రూ.39 లక్షలతో వంతెన నిర్మించారు. అయితే వంతెన నుంచి వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన మట్టి రోడ్డులో ద్విచక్రవాహనాలు తిరగాలన్నా కష్టంగా మారింది. చెరువు కట్టతో పాటు మొత్తం 1400 మీటర్ల దూరం తారు రోడ్డును నిర్మిస్తే ఎంచక్కా రాకపోకలు సాగించవచ్చు. రోడ్డు పూర్తయితే మండల కేంద్రానికి మన్నూరుతో పాటు పల్లిపాడు, అలిమిలి గ్రామాలకు మరింత చేరువ అవుతాయి. మూడు గ్రామ పంచాయతీల ప్రజల ఆశలు నెరవేర్చిన వారవుతారు.

❖ పంచాయతీ రాజ్ శాఖ డీఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా.. తారు రోడ్డుకు గతంలో ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు.

ప్రైవేటు పాఠశాల యజమానికి నోటీసు

కోట, న్యూస్‌టుడే: కోటలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేసి ఈ నెల 15న తరగతులు నిర్వహించడంతో షోకాజ్ నోటీసు జారీ చేశామని ఎంఈవో2 మస్తానయ్య తెలిపారు.

ఇసుక తవ్వకాలకు రుసుముల్లేవు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: ఇసుక ఉచితంగా ఇస్తున్నందున స్థానిక అవసరాలకు తీసుకెళ్లే ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదని తెదేపా సీనియర్ నాయకుడు పేరం మధునాయుడు తెలిపారు. ట్రాక్టర్ల యజమానుల నుంచి మామూళ్ల పేరుతో కొందరు గతంలో వసూళ్లకు పాల్పడ్డారని, ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

తడ, న్యూస్‌టుడే: తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని నిప్పో పరిశ్రమ ఎదురుగా రోడ్డు మార్జిన్‌లో లారీ డ్రైవర్ గుండెపోటుతో మృతిచెందాడు. తమిళనాడు పరిధిలోని తిరుచిరాపల్లి జిల్లా తవకుడి పట్టణానికి చెందిన కన్నన్ అన్నాదురై(37) ఈనెల 15న శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో కెమికల్ పౌడర్‌ను అన్‌లోడ్ చేశాడు. మళ్లీ అక్కడే సరకు లోడు చేసుకునేందుకు ఆలస్యం అవుతుందని తడ నిప్పో పరిశ్రమ ఎదురుగా వాహనాన్ని ఆపి క్యాబిన్‌లో పడుకున్నాడు. సహచర డ్రైవర్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో లారీ ఆచూకీ కోసం వెదికారు. 16న రాత్రి లారీ క్యాబిన్‌లో కన్నన్ అన్నాదురై మృతిచెంది ఉండడాన్ని గుర్తించి తడ పోలీసులకు సమాచారం అందించారు. శవ పరీక్షల అనంతరం మృతదేహాన్ని గురువారం బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసినట్టు ఎస్సై కొండపనాయుడు తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు రైల్వే జంక్షన్ ప్రాంతంలోని గాంధీనగర్ సమీపం టిడ్కో గృహాల వద్ద రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి(35) మృతదేహాన్ని గురువారం జీఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించారు. ఆధారాలు లభ్యం కాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు. ఆ మార్గంలో వెళ్తున్న రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

ఆటో, బస్సు ఢీ: వ్యక్తికి గాయాలు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం చిల్లకూరు వద్ద ఎన్‌హెచ్ 71పై ఆటోను బస్సు ఢీకొంది. గురువారం ఉదయం జరిగిన ప్రమాదం వివరాలు స్థానికుల కథనం మేరకు.. గూడూరు నుంచి తిరుపతి వెళ్తున్న బస్సు నాయుడుపేట వైపు వెళ్తున్న ఆటోని ఢీకొట్టింది. ఆటో దెబ్బతినగా డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని నాయుడుపేట నుంచి నెల్లూరు తీసుకెళ్లినట్లు సమాచారం.

గంజాయి పట్టివేత

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన రహంతుల్లా అక్రమంగా గంజాయి విక్రయాలు చేస్తుండగా గురువారం దాడుల్లో పట్టుకున్నట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. ఇతని వద్ద 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమ సంపాదన కోసం ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి యువతకు విక్రయిస్తున్నాడని చెప్పారు. రహంతుల్లాను న్యాయస్థానంలో హాజరు పరచి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో ఎస్సై సుబ్బారావు, సిబ్బంది శివనారాయణ, రాజేంద్రప్రసాద్, జయచంద్రలు పాల్గొన్నారు.



స్వర్ణముఖి బ్యారేజీకి వరద

వాకాడు, న్యూస్‌టుడే: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజికి గురువారం సాయంత్రం వరద పెరిగింది. హెడ్ రెగ్యులేటర్ నుంచి కాలువ ద్వారా చెరువులకి నీరు విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 8 మీటర్ల ఎత్తులో నీటి మట్టం నిల్వ ఉంది. బ్యారేజీకి మరింతగా వరద వస్తే గేట్లు ఎత్తి దిగువకి విడుదల చేస్తామని బ్యారేజీ అధికారులు పేర్కొన్నారు.

చెరువులకు నీరు

నాయుడుపేట, న్యూస్‌టుడే: నాయుడుపేట ప్రాంతంలో స్వర్ణముఖి నది సగం వరకు నీరు చేరింది. దీంతో స్వర్ణముఖి ఆయకట్టు పరిధిలో చెరువులకు నీరు చేరుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాజీకండ్రిగ కాజ్‌వే వద్ద నది సగం వరకు ప్రవహిస్తోంది. ఏడాది తరువాత నది జలకళతో నిండటంతో సందర్శకులు నది తీరాన్ని తిలకిస్తున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి


ఎంపీడీవో మధుసూదన్‌రావు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: మూడు రోజులుగా కురిసిన వర్షాలకు గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీవో మధుసూదన్‌రావు తెలిపారు. గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగు పర్చేలా పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచి కుటుంబానికి పరామర్శ

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండలంలోని తనయాలికి చెందిన మాజీ సర్పంచి, వైకాపా నాయకుడు చెన్నూరు రమణారెడ్డి కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మాజీ ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిలు పరామర్శించారు. రమణారెడ్డి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తెదేపా, వైకాపా నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రహదారిని కమ్మేసిన పొగమంచు


సింగనాలత్తూరు వద్ద రహదారిపై పొగమంచు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: వాయుగుండం గురువారం తెల్లవారుజామున తీరం దాటిన నేపథ్యంలో దొరవారిసత్రం మండలంలోని పలు గ్రామాలను పొగమంచు కమ్మేసింది. పులికాట్ సరస్సు సమీపంలో ఉన్న సింగనాలత్తూరు, పూలతోట, కల్లూరుకండ్రిగ, శ్రీధనమల్లి తదితర గ్రామాలపై పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉండింది. దీంతో కోట-సూళ్లూరుపేట ర.భ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దెబ్బతిన్న ఉప్పుటేరు కాజ్‌వే

✷ రెండు దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితం ✷ ఇబ్బందుల్లో తీర ప్రాంత ప్రజలు

కోట, న్యూస్‌టుడే: మండలంలోని గోవిందపల్లి-గోవిందపల్లిపాళెం మార్గంలోని ఉప్పుటేరుపై నిర్మించిన కావేజ్ ఐదేళ్లుగా దెబ్బతింది. దీంతో ఆటుపోట్ల కారణంగా నీరు వస్తే కాజ్‌వే ముంపునకు గురై రాకపోకలు స్తంభిస్తాయి. ఈ క్రమంలోనే గోవిందపల్లిపాళెంలోని మత్స్యకార కుటుంబాలు రాకపోకలు సాగించేందుకు వీలుకాదు. నాలుగు రోజులుగా కురిసిన ఓ మోస్తరు వర్షాలకు బీకే కాలువలో ఆటుపోట్ల కారణంగా గతంతో దెబ్బతిన్న కాజ్‌వేపై ఉద్ధృతంగా వరద ప్రవహించడంతో మరింతగా దెబ్బతింది. ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని గోవిందపల్లిపాళెంలో 500 మంది వరకు జనాభా ఉన్నారు. వీరు సమీపంలోని బంగాళాఖాతంలో మత్స్యసంపదను వేటాడి రవాణా చేసి జీవనోపాధి పొందుతారు. గోవిందపల్లిపాళెం నుంచి గోవిందపల్లి వరకు ర.భ.రోడ్డు ఉంది. ఈ మార్గంలోనే ఉప్పుటేర్లున్నాయి. వీటి మీదనే రోడ్డు నిర్మాణంతో పాటు కల్వర్టులు, కాజ్‌వేలున్నాయి. అయితే ఇవి బాగా దెబ్బతిన్నాయి. గత ఏడాది వచ్చిన భారీ తుపానుకు కోతకు గురైంది. మాజీ ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పర్యటించి హైలెవల్ వంతెన నిర్మాణం చేపడతామని ప్రతిపాదనలు పంపారు. స్థానిక ప్రజాప్రతినిధులు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్యదర్శిని కలిసి వంతెనకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అయితే అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. దీంతో వానొచ్చినా.. వరదొచ్చినా ఈ ప్రాంత ప్రజలు అవస్థలు పడాల్సిందే. అధికారులు కూడా అక్కడకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టడం కష్టమే. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మించి కాపాడాల్సి ఉంది.


గోవిందపల్లిపాళెం- గోవిందపల్లి మార్గంలో దెబ్బతిన్న కావేజ్‌వేపై వరద ప్రవాహం

● ర.భ ఏఈ యేహాన్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అవసరమైతే మళ్లీ ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

పంటల మునకతో రైతుల ఆందోళన

వాకాడు, న్యూస్‌టుడే: నాయుడుపేట-దుగరాజపట్నం మార్గంలో గత ఏడాది చేసిన పనులతో తూములు పూడిపోవడంతో తమ పొలాలు ముంపునకు గురయ్యాయని దుగరాజపట్నం, కొత్తూరు రైతులు గురువారం ఆందోళన చేశారు. వెంటనే ర.భ గూడూరు ఈఈ రామాంజనేయులకు ఫిర్యాదు చేయడంతో ఆయన వెంటనే మరికొన్ని తూములు ఏర్పాటు చేసి.. నీరు సక్రమంగా పారుదల జరిగేలా చర్యలు చేపట్టారు. అయితే అక్కడ తూములు బదులు వంతెన నిర్మాణం చేపట్టాలని లేదంటే ఏటా వరదతో తమ పొలాలు ముంపునకు గురవుతున్నాయని ఈఈ వద్ద వాపోయారు.


దుగరాజపట్నం వద్ద ముంపులో పంటలు

అమ్మాయిలు అదరగొట్టారు

అండర్-15 క్రికెట్‌లో రాష్ట్ర జట్టులో స్థానం

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఒకప్పుడు క్రికెట్ కేవలం మగవారు మాత్రమే ఆడేవారు.. కాలానుగుణంగా నేడు మహిళలు కూడా ఈ రంగంలో రాణిస్తున్నారు. తాము ఎందులో తీసిపోమంటూ సత్తా చాటుతున్నారు. క్రికెట్‌ను వేదిక చేసుకుని జీవితానికి స్పష్టమైన లక్ష్యం పెట్టుకున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, శిక్షకుడి సహకారం సద్వినియోగం చేసుకుంటూ సాధన చేశారు. జిల్లా స్థాయి నుంచి జోన్ స్థాయి.. రాష్ట్రస్థాయి వైపు దృష్టి సారించారు బాలికలు. వెంకటగిరిలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన అండర్-15 మహిళా ప్రాబబుల్స్‌లో సత్తా చాటి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించారు.


ఇటీవల మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

జాతీయ జట్టుకు ఎంపిక కావాలని



మాది నెల్లూరు జిల్లా. నరేంద్రబాబు, రమాదేవి తల్లిదండ్రులు. నాన్న ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ క్రికెట్‌లో నేను రాణించేలా కృషి చేస్తున్నారు. వికెట్‌కీపర్, బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నా. ఇప్పటి వరకు 530 పరుగులు చేయగా, ఇందులో ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీలు చేశాను. 10 స్టంపింగ్, 10 క్యాచ్‌లు పట్టుకున్నా. రాష్ట్రస్థాయి జట్టులో రాణించి ఇండియా జట్టుకు ఎంపిక కావడమే నా లక్ష్యం.

– మహాలక్ష్మి, నెల్లూరు

1500 పైగా పరుగులు



మాది తిరుపతి. పదో తరగతి చదువుతున్నా. నాన్న సివిల్ కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డి, తల్లి అనూరాధ. క్రికెట్‌లో రాణించడానికి ప్రధానంగా మా అన్న, అమ్మ కృషి కారణం. ఇప్పటి వరకు దాదాపు 1500 పైగా పరుగులు సాధించా. విజయనగరం, వైజాగ్ జట్లతో తలపడ్డాం. విజయనగరం జట్టుపై అత్యధికంగా 110 పరుగులు సాధించా. కేఎల్ రాహుల్ స్ఫూర్తితో క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నా.

– గ్రీష్మ, తిరుపతి

స్మృతి మంధాన స్ఫూర్తి



తిరుపతి పట్టణానికి చెందిన బ్యాంక్ మేనేజర్ నాగ వెంకటయ్య, దంత వైద్యురాలు, సహాయక ప్రొఫెసర్ శ్రీలక్ష్మి కేదారి మా అమ్మానాన్న. జట్టులో విజయం సాధించడమే లక్ష్యంగా ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నా. ఇప్పటి వరకు 20 పైగా మ్యాచ్‌లు ఆడి 650 పైగా పరుగులు సాధించా. బౌలర్‌గా 25కు పైగా వికెట్లు తీశా. క్రికెటర్ స్మృతి మంధాన స్ఫూర్తితో జాతీయ జట్టులో ఆడటమే లక్ష్యం.

– నేహ శివాని, తిరుపతి

బౌలర్‌గా రాణిస్తా



మాది తిరుపతి. నాన్న మోక్షకానందరెడ్డి ఆర్మీ అధికారి. అమ్మ కల్పన. నేను తొమ్మిదో తరగతి చదువుతున్నా. బౌలర్‌గా రాణిస్తున్నా. ఇప్పటి వరకు 20 మ్యాచ్‌లకు పైగా ఆడి.. 25 పైగా వికెట్లు తీశాను. ఇందులో 4, 3, 5 వికెట్లు చొప్పున ఒక్కో మ్యాచ్‌లో తీశా. బౌలర్‌గా రాణించేందుకు మరిన్ని మెళకువలు నేర్చుకుంటున్నాను. రాష్ట్ర జట్టులో సత్తా చాటుతా. ఇందుకోసం నిరంతరం కృషి చేస్తున్నా.

– గెహనారెడ్డి, తిరుపతి

బార్లలో దిగొచ్చిన ధరలు

● తగ్గింపుపై మద్యం విక్రయాలు ● రిటైల్ దుకాణాల్లో బ్రాండ్లు లభ్యం


లీలామహల్ సమీపంలోని బార్ వద్ద వెలిసిన తగ్గింపు ధరల బ్యానర్

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీతో బార్ల నిర్వాహకులు దిగొచ్చారు. మద్యం ధరలు తగ్గించారు. ఇన్నాళ్లూ ప్రభుత్వ దుకాణాల్లో నాణ్యమైన మద్యం లభ్యం కాకపోవడంతో... బార్ల నిర్వాహకులు రెండింతల ధరలకు విక్రయించేవారు. మందుబాబులు సైతం నాణ్యమైన మద్యం కోసం అడిగినంత ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకురావడంతో అన్ని మద్యం దుకాణాల్లో నాణ్యమైన బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయి. అందులోనూ ఎమ్మార్పీ ధరలకు విక్రయిస్తున్నట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ విక్రయిస్తుండటంతో మందుబాబులు ఎగబడుతున్నారు. దీంతో కొత్త దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఒక్కసారిగా బార్లకు మందుబాబుల తాకిడి తగ్గడంతో... బార్లు తగ్గింపు ధరలు అంటూ బార్ల వద్ద ఫ్లెక్సీలు పెట్టారు. గతంలో 9 హార్స్ మద్యం క్వార్టర్ సీసా ప్రభుత్వ మద్యం దుకాణంలో రూ.130కి విక్రయిస్తుంటే.. బార్లలో రూ.180కి అమ్మేవారు. ప్రస్తుతం అదే బార్‌లో రూ.140కే విక్రయిస్తున్నారు. ఇక అధిక ధర మద్యం ఎమ్మార్పీకే ఇస్తున్నారు.


కొత్త దుకాణం వద్ద వరుస కట్టిన మందుబాబులు

184 దుకాణాలు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా రెండోరోజు 184 నూతన మద్యం రిటైల్ దుకాణాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 227 మద్యం దుకాణాలకుగాను.. మరో 43 దుకాణాలు తెరుచుకోవాల్సి ఉంది. రూ.99లకే నాణ్యమైన చీప్ లిక్కర్ అందుబాటులో ఉంచారు. వారంరోజుల్లో ప్రారంభం అవుతాయని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ వాసుదేవ చౌదరి పేర్కొన్నారు.

40 దుకాణాల సరకు డిపోకు

ఖాళీ చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని మద్యం, కంప్యూటర్లు, ఇతర పరికరాలు తిరుపతిలోని మద్యం డిపోకు తరలిస్తున్నారు. గురువారం రాత్రికి 40 దుకాణాలకు సంబంధించిన సరకు చేరింది. తిరుపతి డివిజన్‌లో మిగిలిన 108 దుకాణాలకు సంబంధించిన మద్యాన్ని తరలిస్తున్నారు.

వైభవంగా పౌర్ణమి గరుడసేవ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి ఏడు గంటలకు సర్వాలంకార భూషితుడైన మలయప్ప స్వామివారు గరుడుని పై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహనసేవలో పెద్దజీయర్, చిన్నజీయర్, తితిదే సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బారాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.


గరుడ వాహనంపై కొలువుదీరిన మలయప్పస్వామి

21 నుంచి మూడు జిల్లాల ఉపాధ్యాయులకు శిక్షణ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి కేంద్రంగా ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి రెండు తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరగనుంది. ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పేరుతో జరిగే ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు 300 మందికి పైగా పాల్గొంటున్నట్లు సమాచారం. మొత్తం 4,000 మంది ఉపాధ్యాయులకు విడతల వారీగా ఈ శిక్షణ నిర్వహించనున్నారు. ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ అధికారుల బదిలీల నేపథ్యంలో శిక్షణ తేదీల్లో మార్పులు ఉండవచ్చనే ఊహాగానాలు విద్యా శాఖలో వినిపిస్తున్నాయి. డీఈవోల బదిలీలకు సంబంధించి త్వరలో మార్గదర్శకాలు వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

వాల్మీకి జీవితం ఆదర్శనీయం

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కలెక్టర్ డా. వెంకటేశ్వర్ అన్నారు. గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి జేసీ శుభం బన్సల్‌తో కలిసి నివాళి అర్పించారు. డీఆర్వో పెంచల కిషోర్, జిల్లా బీసీ సంక్షేమశాఖ సాధికారత అధికారి చంద్రశేఖర్, జిల్లా సమాచార, పౌరసంబంధాలశాఖ అధికారి బాలకొండయ్య, ఏపీజీవీబ్యాంకు జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: 108 అంబులెన్స్ సర్వీసుల్లో ఉద్యోగ ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజరు సంజీవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పైలెట్ ఉద్యోగానికి పదో తరగతి ఉత్తీర్ణులై హెవీ లైసెన్సు లేదా హెవీ ఎల్ఎంవీ లైసెన్సు కలిగి, 35 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉండాలన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎండీ) ఉద్యోగాలకు జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీ ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తిచేసి ఉండాలన్నారు. మెకానిక్ ఉద్యోగాలకు ఏదైనా అనుభవం కలిగి ఉండాలని, మదనపల్లెలోని 108 కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. డ్రైవర్ పోస్టులకు ఈనెల 18న నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రేపు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

చౌడేపల్లె, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 19న ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత వాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలబాలికల విభాగంలో జరిగే ఈ పోటీలకు అర్హులైన క్రీడాకారులను తీసుకొచ్చే పీడీ, పీఈటీలు ఫారం-బీ తీసుకురావాలని సూచించారు. క్రీడాకారుల్లో ఇంటర్ విద్యార్థులుంటే పదో తరగతి మార్కుల జాబితా, ప్రస్తుతం చదువుచున్న కాలేజీ స్టడీ సర్టిఫికెట్ జతపరచాలని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన జట్టు ఈ నెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్ర సాయిలో పోటీల్లో చిత్తూరు జిల్లా తరఫున తలపడనున్నట్లు వివరించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	129
రిటైల్	151
లేయర్	120
బ్రాయిలర్స్	219
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	249
లేయర్ మాంసం	204

స్విమ్స్‌లో రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్‌లో రాష్ట్రస్థాయి నాప్కాన్ -2024 క్విజ్ పోటీలు నిర్వహించారు. 30 మంది శ్వాసకోశ విభాగం పోస్టు గ్రాడ్యుయేట్లకు సంబంధించిన కళాశాలల స్థాయి విజేతలు క్విజ్‌లో పాల్గొన్నారు. అమలాపురం కిమ్స్ కళాశాల విద్యార్థి డా.ఎస్.భార్గవ్ కుమార్ ప్రథమ స్థానంలో నిలిచి రూ.5 వేలు, రెండో బహుమతి ఎస్వీ వైద్య కళాశాల విద్యార్థి డా.ఎం.కాయత్రి కైవసం చేసుకున్నారు. విజేతలకు స్విమ్స్ సంచాలకులు డా.ఆర్‌వీ కుమార్ నగదు బహుమతి, ధ్రువపత్రాలను అందజేశారు. డీన్ డాక్టర్ అల్లాడి మోహన్ తదితరులు పాల్గొన్నారు.


కాయత్రికి ధ్రువపత్రం అందజేస్తున్న డా.ఆర్‌వీ కుమార్, డా.అల్లాడి మోహన్

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని పలువురు ప్రముఖులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, సినీనటి రాశి కుటుంబాలు దర్శించుకున్నాయి. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు.


శ్రీవారి ఆలయం ఎదుట మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబం


సినీనటి రాశి కుటుంబం

జేఎన్‌టీయూఏ కబడ్డీ జట్ల ఎంపిక

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: జేఎన్‌టీయూఏ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ పోటీలకు ఐదు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఎంపిక పోటీల్ని నిర్వహించి.. మహిళల విభాగంలో 12 మంది, పురుషుల విభాగంలో 12 మందితో తుది జట్లు ఖరారు చేశారు. ఎంపికైన జట్లు ఈ నెల 30 నుంచి చెన్నైలోని ఎస్ఆర్ఎం వర్సిటీలో జరిగే దక్షిణాది అంతర విశ్వవిద్యాలయాల టోర్నీలో తలపడనున్నాయని కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌బాబు, జేఎన్‌టీయూఏ క్రీడల బోర్డు కార్యదర్శి జీవీ రెడ్డి తెలిపారు. పీడీలు సుబ్రహ్మణ్యం రెడ్డి, మణి పాల్గొన్నారు.


ఎంపికైన మహిళల జట్టు

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని ఎం.దాత్రి మొగదారమ్మ.. అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ భువనేశ్వరిదేవి తెలిపారు. గురువారం విద్యార్థినిని ఆమె అభినందించారు. ఈనెల 2 నుంచి 5 వరకు పుదుచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తమ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు పాల్గొనగా అందులో దాత్రి ప్రతిభ చాటి ఉత్తరాఖండ్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పీడీ సాయిసుమతి పాల్గొన్నారు.


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ భువనేశ్వరిదేవి

స్విమ్స్‌లో ఎమ్మెస్సీ స్పాట్ ప్రవేశాలు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్‌లో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్.బిట్ల ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు ఖాళీలకు అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ర్యాంక్ కార్డుతో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు హాజరుకావాలని కోరారు.

రాయితీపై క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్ ఆసుపత్రిలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు రాయితీపై మమోగ్రామ్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు ఎంఎస్ డా.రామ్ పేర్కొన్నారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవాల సందర్భంగా స్విమ్స్ ఆంకాలజీ, రేడియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల మహిళా వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. 40 ఏళ్లకు పైబడిన మహిళలు పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

తిరుమలకు ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ


మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి, చిత్రంలో సీవీఎస్‌వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో పెరిగిపోతున్న వాహనాల రద్దీని నియంత్రించేందుకు అత్యవసరంగా ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి పేర్కొన్నారు. స్థానిక అన్నమయ్య భవనంలో గురువారం తితిదే సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి తితిదే, విజిలెన్స్, పోలీసులు, ఆర్టీఏ, టౌన్ ప్లానింగ్ అధికారులతో స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికలపై చర్చించారు. కమిటీగా ఏర్పడి వారం రోజులలోపు సమస్యలను గుర్తించి పరిష్కారానికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు తితిదే నుంచి అదనపు సిబ్బంది కేటాయింపు, మల్టీలెవెల్ పార్కింగ్ కేంద్రాల నిర్మాణం, ట్యాక్సీ డ్రైవర్ల కట్టడి.. ట్రాఫిక్, పార్కింగ్ ముందస్తు సమాచారం అందించేలా మొబైల్ యాప్ సిద్ధం చేయడం తదితర అంశాలపై చర్చించారు. తితిదే రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

కథల పోటీలకు ఆహ్వానం

తిరుపతి (మహిళా వర్సిటీ) : శ్రీపద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో స్త్రీవాద రచయిత్రి ఓల్గా తండ్రి పోపూరి వేంకట సుబ్బారావు పేరిట వచ్చేనెల 27న ధర్మనిధి ఉపన్యాస సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు సంచాలకులు యువశ్రీ గురువారం తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల విద్యాసంస్థల నుంచి తెలుగుశాఖల విద్యార్థులను కథల పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 'స్త్రీ సామాజిక భద్రత' అంశంపై వచ్చేనెల 10వ తేదీలోపు కథను పంపించాలని సూచించారు. ఉత్తమ కథా రచయితకు రూ.10వేల నగదు బహుమతి ఉంటుందని, వివరాలకు 98859 40011లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాజీవ్‌దే సాంకేతిక విప్లవం ఘనత


మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: సాంకేతిక విప్లవం, పంచాయతీరాజ్ చట్టం తెచ్చిన ఘనత దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ అన్నారు. స్థానిక ప్రైవేట్ హోటల్‌లో గురువారం డా.సుందరరావు నేతృత్వంలో రాజీవ్ గాంధీ స్మారక జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. కర్ణాటక రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ మాజీ ఛైర్మన్ నారాయణస్వామి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దంటూ నిరసన

తిరుపతి (నేరవిభాగం, నగరం), న్యూస్‌టుడే: కొర్లగుంట డీబీఆర్ రోడ్డులోని నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుపై స్థానిక మహిళలు గురువారం ధర్నాకు దిగారు. సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి వారికి మద్దతు పలుకుతూ గంటపాటు ధర్నా నిర్వహించారు. దుకాణాన్ని మరో ప్రాంతానికి తరలించాలని కోరారు. వేణుగోపాల్, రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మద్యం దుకాణం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

అమెరికా రోడ్డు ప్రమాదంలో మరో యువకుడి మృతి

కేవీబీపురం, న్యూస్‌టుడే: అమెరికాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి జిల్లాకు చెందిన నలుగురిలో ముగ్గురు మృతి చెందగా.. ఒకరు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం విదితమే. తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం ఆదరం గ్రామానికి చెందిన బ్రహ్మానందంరెడ్డి, సుగుణ దంపతులకు కుమార్తె, కుమారుడు. కుమారుడు చెన్ను సాయితేజ అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. సాయితేజకు సోమవారం సెలవు ఉండటంతో అక్కడే పరిచయమున్న తెలుగు స్నేహితులతో కలిసి అమెరికాలోని ఓ రిసార్ట్‌కు భార్యతో కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జరిగిన కారు ప్రమాదంలో స్నేహితులతో పాటు భార్య హరిత మృతి చెందగా, సాయితేజ తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయితేజ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు.